Follow: @ANNTELUGU
21-11-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 333 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## హైదరాబాద్‌కు ఫిజికల్ ఇంటెలిజెన్స్ బూస్ట్

**టెక్నాలజీతో హైదరాబాద్ రూపురేఖలు మార్పు**

8 వారాల్లో దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్

అలెక్స్ కిప్‌మన్‌తో సీఎం సమావేశం.. ట్రాఫిక్, వరదలు, కాలుష్య నియంత్రణపై చర్చ

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దడానికి వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అనలాగ్ ఏఐ సీఈఓ అలెక్స్ కిప్‌మన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### మన్నె గోవర్ధన్ రెడ్డికి కేసీఆర్ బంపర్ ఆఫర్

- ఖైరతాబాద్ బరిలో పందెంకోడి ఆయనే?



03

### రాష్ట్రంలో రేవంత్, కేటీఆర్ పాలన

- కేటీఆర్ ను ఎప్పటిలోగా అరెస్ట్ చేస్తారో చెప్పాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్
- అర్బన్ నక్సల్స్ పై మరోసారి మండిపాటు



02

### ప్రజల సొమ్ము దోచుకుంటే శిక్ష తప్పదు

- కక్ష సాధింపు లేదు.. అలా చేస్తే కేసీఆర్, కేటీఆర్ జైల్లో ఉండేవారు
- కేటీఆర్ కడిగిన ముత్యమో కాదో త్వరలో తెలుస్తుంది
- కాళేశ్వరం విచారణ ఆలస్యంపై బీజేపీ సమాధానం చెప్పాలి
- టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ హాట్ కామెంట్స్



02

# కేబినెట్‌లోకి దానం, మహేష్ గౌడ్, రాజగోపాల్ రెడ్డి?


## పీసీసీ చీఫ్‌గా కోమటిరెడ్డి?.. కాంగ్రెస్‌లో సంచలన చర్చలు

ఢిల్లీలో మకాం వేసిన దానం.. నేడు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో రాజగోపాల్ రెడ్డి భేటీ?

మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకునేందుకు ఇప్పటికే లైన్ క్లియర్ అయిందన్న ప్రచారం

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత అంశానికి మంత్రివర్గ విస్తరణకు లింక్

ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహంపై సర్వత్రా ఉత్కంఠ



**హైదరాబాద్ -మహా:**

"తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఏం జరగబోతోంది? కేబినెట్ లో మార్పులు చేర్పులపై జరుగుతున్న ప్రచారం నిజమేనా? ఢిల్లీలో దానం నాగేందర్ కు మంత్రివర్గంలో చోటుపై హామీ లభించిందా? మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఢిల్లీ బయలుదేరి వెళ్ళారా? కాంగ్రెస్ పార్టీలో సంచలన మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త ఎత్తుగడలు అవలంభిస్తున్నారా? పీసీసీ చీఫ్ గా ఉన్న మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకుని ప్రాధాన్యం ఇవ్వాలని డిసైడ్ అయ్యారా? మహేష్ గౌడ్ తర్వాత పీసీసీ చీఫ్ గా కోమటిరెడ్డి వెంకటరెడ్డిని చేసే ప్రతిపాదన ఉందా? తెలంగాణ పాలిటిక్స్ ఏం జరగబోతోంది? అంతా ఆసక్తికరం, సంచలనం.

వివరాలు 2లో




### మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు

డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో నిర్వహణ? నవబర్ 26న షెడ్యూల్

వివరాలు 2లో



### నెట్టింట మోదీ ట్రెండింగ్

**మెడలోని కండువా తీసి..**

**పాట్నా:** బీహార్లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ గురువారం జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్‌కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు. వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్నారు.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు షాక్

**బండి సంజయ్ కు క్లీన్ చిట్**

**హైదరాబాద్, మహా :** కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీ కేసులో ఊరట దక్కింది. దీనిపై విచారించిన న్యాయస్థానం ఈ కేసును కొట్టివేసింది. ఇది పూర్తి నిరాధారమైన కేసుగా తోసిపుచ్చింది. 2023 ఏప్రిల్‌లో టెన్త్ వార్షిక పరీక్షలు జరుగుతుండగా హన్మకొండ జిల్లాలో హిందీ పేపర్ లీక్ అయింది.

మిగతా 2లో



### దానం, కడియంకు మరోసారి నోటీసులు

అనర్హత పిటిషన్లపై అఫిడవిట్‌లు దాఖలు చేయాల్సిందేనన్న స్పీకర్

నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి

**హైదరాబాద్, మహా :** ఫిరాయింపు నేతల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు డెడ్‌లైన్ పెట్టడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పీడ్ పెంచారు. ఈ క్రమంలోనే గురువారం అరెకెపుడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డిని స్పీకర్ విచారించనున్నారు. ఇదే సమయంలో అనర్హత పిటిషన్లపై తాను ఇచ్చిన నోటీసులకు

మిగతా 3లో

### కేటీఆర్‌కు బిగ్‌షాక్

- ఫార్ములా ఈ కార్ కేసులో విచారణకు గవర్నర్ అనుమతి
- ఇక అరెస్ట్ తప్పదా?



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్. ఫార్ములా ఈ కార్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏసీబీకి అనుమతిచ్చారు. గురువారం ఉదయం ప్రాసిక్యూషన్ కు సంబంధించిన ఫైలును గవర్నర్ క్లియర్ చేసి ఏసీబీకి పంపారు.

మిగతా 2లో

# జగన్.. జగన్

## హైదరాబాద్‌లో పోటెత్తిన అభిమానం

**సీబీఐ కోర్టుకు హాజరైన జగన్ .. అక్కడి నుండి లోటస్ పాండ్ కు**



**హైదరాబాద్, మహా :** నాంపల్లిలోని సీబీఐ కోర్టులో వైఎస్ జగన్మోహన్ రెడ్డి విచారణ ముగిసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు జగన్ గురువారం సీబీఐ కోర్టుకు వచ్చారు. ఇన్నిసంవత్సరాల విచారణలో జగన్‌కు వ్యక్తిగత హాజరునుండి మినహాయించిన కోర్టు తాజాగా వ్యక్తిగత హాజరు తప్పనిసరి చేసింది. వ్యక్తిగత మినహాయింపును సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలోనే గురువారం జరిగిన విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఉదయం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న జగన్ అక్కడి నుండి నాంపల్లి సీబీఐ కోర్టుకు చేరుకున్నారు. బేగంపేట్ విమానాశ్రయం నుండి జగన్ వెంట పెద్ద ర్యాలీగా కోర్టుకు అభిమానులు చేరుకున్నారు. ఎయిర్ పోర్టులో జగన్ విమానం దిగి నేతలు, అభిమానులకు అభివాదం చేసుకుంటు విమానాశ్రయం బయటకు వచ్చారు.

మిగతా 2లో

# పువర్తి కన్నీటి సంద్రం..!




- కొడుకు శవంపై ఆరిపోయిన తల్లి ఆశ!
- తెల్లగుడ్డలో కాలిపోయిన మాతృమూర్తి ఆశలు
- హిడ్మా మరణంతో కన్నీటి చార అయిన పువర్తి గూడెం
- అడవిని వీడని ఆర్తనాదం

**ఖమ్మం బ్యూరో, మహా:**

నవంబర్ 20, 2025.సాయంత్రం.ఆ కోయగూడెం.. పువర్తి. ఇప్పుడు అది కేవలం ఒక గ్రామం కాదు. రెక్కలు రాలిన పక్షిలా లేదు. గుండె పగిలిన తల్లి ఆక్రందనలా, గగనాన కమ్ముకున్న నల్లటి మబ్బులా నిశ్శబ్దంగా మారింది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత మడ్వీ హిడ్మా మృతదేహం భద్రతా బలగాల బందోబస్తు నడుమ ఇక్కడికి చేరుకుంది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వస్తున్న బూట్ల చప్పుడు తప్ప, అక్కడ ఊపిరి సలపడం లేదు. పూంజీ... మడ్వీ పూంజే. 72 ఏళ్ల ఆ ఎముకల గూడు. ఆ తల్లి గొంతులో ఇప్పుడు పలికేందుకు మాట లేదు, కళ్లలో కన్నీరు లేదు. "కొడుకా, ఇంటికి రా రా!" అని ఆశగా పిలిచిన ఆ స్వరం, ఇవాళ తెల్లగుడ్డలో చుట్టి వచ్చిన బిడ్డ 'శవం'పై శాశ్వతంగా ఆరిపోయింది. ఆయుధాన్ని వదిలిపెట్టి రమ్మని కోరిన తల్లికి, బిడ్డ భౌతికకాయం మాత్రమే మిగిలింది.

మిగతా 2లో



# కేబినెట్ లోకి దానం, మహేష్ గౌడ్, రాజగోపాల్ రెడ్డి?

(మొదటిపేజీ తరువాయి)

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మొదటి నుండీ మంత్రి పదవి కోరుతున్నారు. మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన దానం నాగేందర్ బీఆర్ఎస్ నుండి గెలిచి కాంగ్రెస్ లో చేరగా, సికింద్రాబాద్ ఎంపీగా కూడా పోటీచేశారు. స్వల్పతేదాతో పరాజయం పాలయ్యారు. ఈ క్రమంలో ఆయనపై అనర్హత కత్తి వేలాడుతోంది. తాజాగా స్పీకర్ ను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించి వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో స్పీకర్ మరోసారి దానం నాగేందర్ కు నోటీసిచ్చారు. అయితే రిప్లయ్ ఇస్తే, అనర్హత వేటు పడితే పోటీకి దూరంగా ఉండాల్సి వస్తుందని భావిస్తున్న దానం నాగేందర్ స్పీకర్ ఫార్మాట్ లో రాజీనామాకు సిద్దంగా ఉన్నానని, తనను మంత్రివర్గంలోకి తీసుకుంటే ఎన్నిక సులువు అవుతుందని హైకమాండ్ కు చెప్పినట్లు తెలిసింది. అందులో భాగంగానే గురువారం ఢిల్లీలో హైకమాండ్ పెద్దలను కలిసినట్లు తెలిసింది. హైకమాండ్ ను కేబినెట్ బెర్త్ పై గ్రీన్ సిగ్నల్ లభిస్తే ఇటు రాజీనామా, అటు ప్రమాణం ఒకేసారి ఉండే అవకాశం ఉంది.

**ఢిల్లీకి రాజగోపాల్ రెడ్డి**

మరోవైపు ఢిల్లీలో జరుగుతున్న విస్తరణ పరిణామాల నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్ళినట్లు తెలిసింది. శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలను కలిసి తనకు ఇచ్చిన హామీని గుర్తుచేసి కేబినెట్ బెర్త్ పై పట్టుబట్టే అవకాశాలున్నట్లు చర్చ జరుగుతోంది. మొత్తంగా ఢిల్లీలో ఏదో రాజకీయ సమీకరణాలు సరికొత్త చర్చలు జరుగుతున్నాయి. రాజగోపాల్ రెడ్డిని కేబినెట్ లోకి తీసుకుంటే కేబినెట్ కు సంబంధించి చిక్కుముడులన్నీ విప్పేసినట్లేనన్న భావన పార్టీ హైకమాండ్ లో వ్యక్తమవుతోంది.

**కేబినెట్ లోకి పీసీసీ చీఫ్?**

ప్రస్తుతం పీసీసీ చీఫ్ గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకుని కీలక పోర్ట్ ఫోలియో లేదా డిప్యూటీ సీఎం అప్పగించే అవకాశాలున్నాయన్న చర్చ జరుగుతోంది. పీసీసీ చీఫ్ గా మహేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించింది దాదాపు 15 మాసాలు కాగా, సమర్ధవంతంగా పనిచేశారన్న పేరుంది. బీసీల గొంతుకగా ప్రత్యేకత సంపాదించుకున్నారు. నిజామాబాద్ నుండి ఇటీవల కాలంలో సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు పదవి దక్కడంతో మహేష్ గౌడ్ లైన్ క్లియర్ అయినట్లేనన్న చర్చ పార్టీ వర్గాల్లో ఉంది. దీనికి తోడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కేబినెట్ లోకి తీసుకుంటే ఆయన సోదరుడు మంత్రి వెంకటరెడ్డిని పీసీసీ చీఫ్ గా నియమించే అవకాశాలున్నాయని, సీఎం ఈ ప్రతిపాదన పట్ల సానుకూలంగా ఉన్నారన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలో రాజకీయ మార్పులపై సంచలన చర్చలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఒకసారి జరుగుతాయా? విడతల వారీగా జరుగుతాయా? ఇంతకూ ముఖ్యమంత్రి ఏ సమయంలో ఏ ఎత్తుగడ అవలంభించేబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ మార్పులు కనుక జరిగితే తెలంగాణ పాలిటిక్స్ లో సంచలనాలు ఖాయం. హస్తినలో ఏం జరుగుతుందో చూడాలి.

# పువర్తి కన్నీటి సంద్రం..!

(మొదటిపేజీ తరువాయి)

పువర్తి మట్టిలో పదిలం అవుతున్న ఆ కన్నీటి చార, ఒక తల్లి కడుపుకోతకు, ఒక గిరిజన గ్రామం అనుభవిస్తున్న విషాదానికి నిలువెత్తు సాక్ష్యం. హిడ్మా తల్లి, 72 ఏళ్ల మడ్వీ పూంజే, తన బిడ్డ మరణవార్త విన్న నాటి నుండి ఎండిపోయి, బండ కట్టి, శూన్యంగా చూస్తున్నారు. నలుగురైదుగురు కానిస్టేబుల్లు వచ్చి ఆ గుండెపగిలే వార్త చెప్పినప్పుడు, ఆమె దీనంగా, "అయ్యా, నేను ముసల్దాన్ని.. నా కొడుకు శవాన్నైనా ఇక్కడికి తీసుకువచ్చి చివరి చూపులు చూపించండయ్యా" అని వేడుకున్నారు. ఆ వినతి మేరకు, బుధవారం రాత్రి పోస్ట్‌మార్టం పూర్తి అయిన తర్వాత, గురువారం ఉదయం హిడ్మా భౌతికకాయాన్ని రంపచోడవరం మార్చురీ నుంచి భారీ బందోబస్తు నడుమ పువర్తికి తీసుకువచ్చారు. ఆ తల్లి మాతృత్వానికి, ఆ కడుపుకోతకు ప్రభుత్వం ఇచ్చిన చివరి గౌరవం ఇది. ఆ 'తెల్లగుడ్డ చుట్టిన అదృశ్యాన్ని' చూసిన మడ్వీ పూంజే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమె మాతృత్వమంతా "రూన్‌సౌన్" అనే ఆర్తనాదంగా మారిపోయింది. అది చిన్నగా మొదలైన కుమిలిపాటు. నెమ్మదిగా కేకలా మారి.. హిమాలయాన్ని కదిలించే శక్తిలా పెద్దదై.. చివరకు మళ్లీ గుండెలో కలిసిపోయే విలాపం. "నాన్నా, నువ్వు అడవిలో ఏమైపోయావో అనుకున్నా గాని, తెల్లగుడ్డలో ఇంత తొందరగా నా దగ్గరికి వస్తావని అనుకోలేదురా! ఈ ముసల్దాని బాధ్యత వదిలి ఎక్కడికి పోయావు కొడుకా?" అని రోదించింది. ఆ విలాపం విన్న చుట్టుపక్కల జనం భయంతో వణుకుతూ, కళ్ల నిండా కన్నీళ్లతో దూరంగా ఉండిపోయారు.

**జనసంద్రమైన గ్రామం, ఆరిపోయిన ఆశలు**

హిడ్మా కమ్యూనిస్టు కావచ్చు, దేశాన్ని గడగడలాడించిన నాయకుడు కావచ్చు. కానీ, ఇప్పుడు ఆ పేటికలో ఉన్నది కేవలం ఒక కొడుకు శవం. ఆ తల్లికి లోకమంతా ఆ కొడుకే. గతంలో హోం మంత్రి శర్మతో కలిసి భోజనం చేసినప్పుడు, "ఇంటికి రా రా కొడుకా", "లొంగిపోతే పునరావాసం ఇస్తాం" అని ఆ తల్లి గుండెలో పడిన ఆశలన్నీ, ఇవాళ తెల్లగుడ్డలో కాలిపోతున్నాయి. ఆయుధాన్ని వదిలిపెట్టి రమ్మని కోరిన తల్లికి, బిడ్డ శవం మాత్రమే మిగిలింది. హిడ్మా దంపతుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు పరిసర గ్రామాల ప్రజలతో పాటు వివిధ జిల్లాల నుండి ఆదివాసీలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సుదూర ప్రాంతాల నుండి సైతం కాలినడకన పువర్తి గ్రామానికి చేరుకోవడంతో, కీకారణ్యంలో ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా హిడ్మా బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను చూసిన వారందరూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

**కట్టుదిట్టమైన భద్రత.. న్యాయ విచారణ డిమాండ్**

మావోయిస్టు అగ్రనేత అంత్యక్రియల నేపథ్యంలో పువర్తి, పరిసర గ్రామాల్లో పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. పువర్తి గ్రామానికి వచ్చే వారిని ఎక్కడికక్కడ నిలిపివేసి ఆరాతీశారు. మావోయిస్టులు ఏదైన అవాంఛనీయమైన ఘటనలకు పాల్పడకుండా కట్టుదిట్టమైన భద్రతా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు, హిడ్మా, అతడి భార్య, సన్నిహితులది బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తూ, మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హిడ్మా కాలం ముగిసింది. పువర్తి గ్రామం కొత్త మార్గంలో నడవవచ్చు. భద్రతా క్యాంపులు ఎత్తివేయవచ్చు. పాఠశాలలు రావచ్చు. కానీ, ఆ గూడెం గుండె లోపల... ఒక తల్లి ఏడుపు శాశ్వతంగా ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఆ కళ్లల్లో నీళ్లు ఇంకిపోయినా.. ఆ గుండెలో మంట మాత్రం ఆరిపోదు. మాతృమూర్తి వేదన మాత్రం ఆ అడవిలో ఎప్పటికీ ఒక విషాద గీతంలా మిగిలిపోతుంది.



# కేటీఆర్‌కు బిగ్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్‌బీజేపీలు కుమ్మక్కవ్వబట్టే కేటీఆర్ ప్రాసిక్యూషన్ ఫైలుపై గవర్నర్ సంతకం పెట్టడంలేదంటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కూడా పదేపదే ఆరోపణలు గుప్పిస్తున్నారు. కారణాలు ఏవైనా చివరకు ఈరోజు కేటీఆర్ ను విచారించేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. గవర్నర్ తాజా అనుమతితో తొందరలోనే ఏసీబీ ఉన్నతాధికారులు కేటీఆర్ పై చార్జిషీటు దాఖలు చేయబోతున్నట్లు సమాచారం. ఈ కేసును విచారణను నిలిపేయాలంటు కేటీఆర్ కోర్టులో కేసు దాఖలుచేసినా ఉపయోగంలేకపోయింది. ఆర్ధికశాఖ, క్యాబినెట్ అనుమతి, రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండానే అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తనిష్టారాజ్యంగా బ్రిటన్ కంపెనీ ఫార్ములా ఈ కంపెనీకి హెచ్ఎండీఏ నుండి 46 కోట్ల రూపాయలు డాలర్ల రూపంలో చెల్లించేశారు. కేటీఆర్ మొబైల్ వాట్సప్ ద్వారా ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తాను చెల్లింపులు చేసినట్లు అర్వింద్ ఇప్పటికే చీఫ్ సెక్రటరీ నిర్వహించిన శాఖాపరమైన విచారణలోను, తర్వాత ఏసీబీ విచారణలోను అంగీకరించినట్లు సమాచారం. దాంతో కేటీఆర్ పై కేసు గట్టిగా బిగుసుకున్నది. తనపైన ఏసీబీ నమోదుచేసిన కేసు లొట్టిపిట్ట కేసుగా కేటీఆర్ పైకి బింకం ప్రదర్శిస్తున్నప్పటికీ లోలోపల మాత్రం టెన్షన్ తో ఉన్నారు. కేటీఆర్ ను విచారించి చార్జిషీటు నమోదుచేయబోతున్న ఏసీబీ అర్వింద్ కుమార్ పైన కేసులు నమోదుచేయటానికి ఢిల్లీలో కేంద్ర హోంశాఖ పరిధిలో పనిచేస్తున్న డీవీపీటీకి లేఖ రాసింది. వారం రోజుల్లోపే కేటీఆర్ మీద ఏసీబీ చార్జిషీటు దాఖలుచేయటానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. కేటీఆర్ అరెస్టయితే రాజకీయంగా అనేక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

# రాష్ట్రంలో రేవంత్, కేటీఆర్ పాలన

**హైదరాబాద్, మహా :** మాజీమంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు గవర్నర్ అనుమతివ్వడాన్ని మేం స్వాగతిస్తున్నామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇన్నాళ్లు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ఆరోపించిన సీఎం ఇప్పుడేమంటారు?. రాష్ట్రంలో ఆర్కే (రేవంత్ రెడ్డి, కేటీఆర్) పాలన కొనసాగుతోంది. అవినీతికి పాల్పడే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ ప్రభుత్వం సహించదన్నారు. కచ్చితంగా చర్యలుంటాయన్నారు. గవర్నర్ అనుమతిచ్చారు కాబట్టి దమ్ముంటే కేటీఆర్ ను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.



## అర్బన్ నక్సల్స్‌పై ధ్వజం

అర్బన్ నక్సల్స్, కమ్యూనిస్టు పార్టీలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి నిప్పులు చెరిగారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కన్పించని కబోధులని అభివర్ణించారు. అమాయకులను రెచ్చగొట్టి ఆయుధాలు చేతపట్టించి వారు చావులకు కారకులైన అర్బన్ నక్సల్స్ సాధించిందేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని ఆ పార్టీకి మద్దతిస్తూ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములయ్యారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాళ్లకు ఏమాత్రం నైతికత ఉన్నా ఆ పదవులకు రాజీనామా చేసి బయటకు వచ్చి వాస్తవాలు మాట్లాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ, నగరాలు, పట్టణాల్లో ఏసీ రూముల్లో ఉంటూ బూటకపు ఎన్ కౌంటర్ల గురించి మాట్లాడుతున్న సోకాల్డ్ కమ్యూనిస్టులు, అర్బన్ నక్సల్స్ ఎన్నడైనా లొంగిపోవాలని చెప్పారా? వాళ్లు చనిపోయాక మాత్రం బూటకపు ఎన్ కౌంటర్లని మాట్లాడుతూ పాటలు పాడి శవాలకు నివాళి అర్పించడం తప్ప వాళ్లు చేసిందేమిటి?. ఒకవైపు రాజ్యాంగాన్ని కాపాడాలని వాళ్లే ఆందోళనలు చేస్తారు. ఇంకోవైపు అదే రాజ్యాంగానికి వ్యతిరేకంగా తుపాకీ పట్టి నక్సలిజంలో చేరాలని అమాయకులను రెచ్చగొడతారు? ఇదేం ద్వంద్వ నీతి. అసలు వాళ్లకు స్పష్టత, లక్ష్యం ఉందా? అని విరుచుకుపడ్డారు. బీజేపీకి ఒక లక్ష్యం ఉంది. బ్యాలెట్ ను నమ్ముకుని బీజేపీ వరుసగా కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. దాదాపు 20 రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగుతోంది. కోట్లాది మందికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చామని, కోట్లాది మందికి ఉచితంగా రేషన్ సహా సంక్షేమ పథకాల లబ్ది చేకూరుస్తున్నామన్నారు. ఆర్ధిక ప్రగతిలో భారత్ ను 4వ స్థానానికి తీసుకొచ్చి అమెరికా, రష్యా, చైనా, జపాన్ సరసన చేర్చామన్నారు. మా లక్ష్యం 2047 నాటికి వరల్డ్ నెంబర్ వన్ దేశంగా భారత్ ను మార్చేందుకు వికసిత్ భారత్ దిశగా ముందుకు సాగుతున్నాం... మరి మీ లక్ష్యం ఏమిటని నిలదీశారు. మోదీ సంక్షేమ పథకాలు మీకు కన్పించడం లేదు? మేం చేసిన అభివృద్ధి కన్పించడం లేదు? ఉచిత రేషన్ బియ్యం కన్పించదు. 10 లక్షల మందికి రోజ్ గార్ మేళా పేరుతో ఉద్యోగాలిచ్చినం. గాంధీ ఆశయాలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. చిట్ట చివరి వ్యక్తికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలని దీన్ దయాళ్ సిద్ధాంతాన్న అమలు చేస్తున్నాం... మేం ఇన్ని చేసినా మీకు కన్పించదు. మేం చేసిన అభివృద్ధి కన్పించదు. మతతత్వవాదులని ముద్ర వేస్తారు. ఇదేం పద్ధతి అని అర్బన్ నక్సలైట్లను ఉద్దేశించి అన్నారు.

# హైదరాబాద్‌కు ఫిజికల్ ఇంటెలిజెన్స్ బూస్ట్

## టెక్నాలజీతో హైదరాబాద్ రూపురేఖలు మార్పు

8 వారాల్లో దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్: సీఎం

అలెక్స్ కిప్‌మన్‌తో రేవంత్ రెడ్డి సమావేశం.. ట్రాఫిక్, వరదలు, కాలుష్య నియంత్రణపై చర్చ



(మొదటిపేజీ తరువాయి)

ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కార మార్గాలపై సమావేశంలో చర్చ జరిగింది. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్‌టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేయవచ్చని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని నిర్ణయించారు.

**హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్..**

ఈ ప్రోగ్రాం ఎనిమిది వారాల పాటు అమలుకానుంది. ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులో భాగంగా సీసీటీవీ వ్యవస్థను రియల్‌టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మార్చడం జరుగుతుంది. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలను ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్‌గా మానిటరింగ్ నిర్వహిస్తారు. పైలట్ ప్రోగ్రాం పూర్తయ్యే సమయానికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయి. ముఖ్యమంత్రి భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన, సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను వివరించారు. ఆర్థిక వృద్ధికి ఫిజికల్ ఇంటెలిజెన్స్ అత్యుత్తమ పరిష్కారాలను అందిస్తుందని అలెక్స్ కిప్‌మన్ పేర్కొన్నారు. డిసెంబర్ 8-9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ముఖ్యమంత్రి అలెక్స్ కిప్‌మన్‌ను ఆహ్వానించారు.

# మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు

డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో నిర్వహణ?

నవబర్ 26న షెడ్యూల్

**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు రంగం సిద్ధమైంది. నవంబర్ 26 లేదా 27వ తేదీన పంచాయతీ ఎన్నికల నగారా మోగనుందని తెలుస్తోంది. మొత్తం మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఎస్ ఈ సీ కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ ఎన్నికలను చాలా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ స్పష్టం చేసింది. గురువారం నుంచి నవంబర్ 23వ తేదీ వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వ తేదీ వరకు ప్రజా పాలన వారోత్సవాలు జరుగుతాయి. ఆ తర్వాత ఈ ఎన్నికల నిర్వహించాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే.. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

# కేటీఆర్‌కు బిగ్‌షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఫార్ములా ఈ కార్ రేసులోరు. 54 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలపై కేటీఆర్ పైన ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ ఏ1గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏ 2, హెచ్ఎండీఏ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏ 3గా ఏసీబీ కేసులు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏసీబీ అధికారులు ఈ ముగ్గురిని విచారించింది. అవినీతి, అధికార దుర్వినియోగం లాంటి అనేక అభియోగాలను కేటీఆర్ పై ఏసీబీ నమోదుచేసింది. కేటీఆర్ మీద చార్జిషీటు దాఖలుచేయాలన్నా, అరెస్టు చేయాలన్నా గవర్నర్ అనుమతి అవసరం. అందుకనే 70 రోజుల క్రితం అనుమతి కోరుతు ఏసీబీ ఉన్నతాధికారులు గవర్నర్ కు ఫైల్ పంపారు. న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపి, సలహాలు తీసుకున్న తర్వాత కూడా గవర్నర్ చాలా రోజులు ఫైలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గవర్నర్ వైఖరి ఇటు కాంగ్రెస్ అటు బీజేపీ మధ్య పెద్ద వివాదానికి దారితీసింది.

# నేడు నగరానికి రాష్ట్రపతి రాక

**హైదరాబాద్, మహా:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేడు నగరానికి రానున్నారు. సాయంత్రం 4 గంటలకు రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళామహోత్సవ్ 2025ను ఆమె ప్రారంభిస్తారు. డిస్కవర్ ద కలర్, క్రాఫ్ట్, కల్చర్ అండ్ ఫ్లేవర్స్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా ఇన్ హైదరాబాద్ పేరిట ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక, పర్యాటక, చేనేత, జౌళి మంత్రిత్వ శాఖల సహకారంతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి రాష్ట్రపతితో పాటు తెలంగాణ, రాజస్థాన్, గోవా గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, బి హరిబాబు, పి అశోక గజపతి రాజు, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర మంత్రి సీతక్క, తదితరులు హాజరుకానున్నారు. సాయంత్రం 5 గంటలకు రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. కాగా... ఈ కార్యక్రమం ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుంది. 9 రోజుల పాటు కొనసాగే ఈ కళామహోత్సవ్ లో హస్తకళలు, జానపద, శాస్త్రీయ, సంగీత, నృత్యాలు, పర్యాటక శాఖ ప్రదర్శనలు, వివిధ రకాల వంటకాల రుచులు, సహా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమానికి వచ్చే సందర్శకుల కోసం ప్రవేశం ఉచితంగా ఉంటుంది. https://visit.rashtrapatibhavan.gov.in/plan visit/rashtrapatinilayamhyderabad/p2/p2 లింక్ ద్వారా ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉచితంగా టికెట్స్ బుక్ చేసుకోవచ్చు.

# జగన్.. జగన్

## హైదరాబాద్‌లో పోటెత్తిన అభిమానం

**సీబీఐ కోర్టుకు హాజరైన జగన్ .. అక్కడి నుండి లోటస్ పాండ్ కు**



(మొదటిపేజీ తరువాయి)

అప్పటికే వేలాదిసంఖ్యలో విమానాశ్రయం బయట వేచి ఉన్న అభిమానులు ఒక్కసారిగా జిందాబాద్ లు కొట్టారు.


**జగన్ కు పోటెత్తిన అభిమానం**

బేగంపేట విమానాశ్రయంలో జగన్ కు స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున చేరుకున్నారు. నేతలు, అభిమానులకు అభివాదం చేస్తు విమానాశ్రయంనుండి బయటకు వచ్చిన జగన్ తో పాటు అభిమానులు భారీఎత్తున ర్యాలీగా సీబీఐ కోర్టుకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎయిర్ పోర్టు, నాంపల్లి కోర్టు దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కోర్టులో జగన్ తో పాటు లాయర్లను తప్ప ఇంకెవరినీ పోలీసులు అనుమతించలేదు. విచారణ ప్రక్రియ ముగియగానే జగన్ లోటస్ పాండ్ లోని తన నివాసంకు చేరుకున్నారు. అక్కడి నుండి తల్లి విజయమ్మ దగ్గరకు వెళ్ళారు. జగన్ హైదరాబాదుకు చాలా కాలం తర్వాత వచ్చారు. దాంతో ఎయిర్ పోర్టుతో పాటు కోర్టు దగ్గర అభిమానులు పెద్దఎత్తున హడావుడిచేశారు. జగన్ క్రేజ్ ఫాలోయింగ్ మరోసారి హైదరాబాద్ లో చర్చనీయాంశంగా మారింది.

# ప్రజల సొమ్ము దోచుకుంటే శిక్ష తప్పదు

- కక్ష సాధింపు లేదు.. అలా చేస్తే కేసీఆర్, కేటీఆర్ జైల్లో ఉండేవారు
- కేటీఆర్ కడిగిన ముత్యమో కాదో త్వరలో తెలుస్తుంది
- కాళేశ్వరం విచారణ ఆలస్యంపై బీజేపీ సమాధానం చెప్పాలి
- టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడదని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఒకవేళ అలా చేసి ఉంటే కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావు ఇప్పటికే జైల్లో ఉండేవారని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రజల సొమ్ము ఎవరు తిన్నా శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. ఎవరిని అడిగి ప్రజలకు సంబంధించిన కోట్ల రూపాయలను కేటీఆర్ బదిలీ చేశారని ఆయన ప్రశ్నించారు. గురువారం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, మోదీ, రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకొని ఉంటే, గవర్నర్ అనుమతి 6 నెలల ముందే వచ్చేది కదా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ ఓడిపోయిన తర్వాతే గవర్నర్ దిమ్మ తిరిగి అనుమతి ఇచ్చారని వ్యాఖ్యానించారు.



బీసీ రిజర్వేషన్ల అంశంపై బీజేపీపై మండిపాటు

42 శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇంకా చిత్తశుద్ధితోనే ఉందని, ఈ విషయాన్ని బీసీ సంఘాలు గ్రహించాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు. తనకు చట్టపరంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చే ఎన్నికలకు వెళ్లాలని ఉన్నా, కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలకు వెళ్లాల్సి వస్తే పార్టీ పరంగా ఇచ్చి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్‌కు అవకాశం ఉన్నా బీసీ రిజర్వేషన్లు కల్పించడం లేదని ఆయన మండిపడ్డారు. బండి సంజయ్‌కి ఏమీ తెలియదని, ఎందుకు 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో పెట్టడం లేదో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ అసలు చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు గవర్నర్ అనుమతి ఎందుకు ఆలస్యం అయిందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

**అవినీతిపై చట్టం తన పని తాను చేస్తుంది..**

తమకు కక్ష సాధింపు లేదని, అలా అనుకుంటే అరెస్టులు మొదట్లోనే ఉండేవని మహేష్ కుమార్ గౌడ్ పునరుద్ఘాటించారు. విచారణ చట్ట ప్రకారమే ఉంటుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పగించామని, సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లక్షల కోట్లు అవినీతి జరిగింది అని బీజేపీ నాయకులే చెప్పారని, మరి సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఖజానాను ఇష్టారీతిలో పంచుకోవాలని రాజ్యాంగం చెప్పిందా అని నిలదీశారు. తన మనుషులకు ప్రజల సొమ్మును ఇష్టారీతిలో పంచుకున్నారు, చూస్తూ ఊరుకోబోమని అన్నారు. కేటీఆర్ కడిగిన ముత్యంగా లోపలే ఉంటారో బయటికి వస్తారో త్వరలో తెలుస్తుందని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీనే అని ఆరోపించారు. ఆర్డినెన్స్ తెచ్చినా, 9వ షెడ్యూల్‌లో ఎందుకు కేంద్రం చేర్చలేదో చెప్పాలని కోరారు. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నా చేసిందని, పంచాయతీ ఎన్నికలతో బీసీ 42 శాతం రిజర్వేషన్ల పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు .

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు షాక్

## బండి సంజయ్ కు క్లీన్ చిట్

(మొదటిపేజీ తరువాయి)

ఈ పేపర్ పరీక్షకు ముందు పలు వాట్సాప్ గ్రూప్‌లలో లీక్ అయ్యింది. ఈ పేపర్ లీకేజీ వెనుక అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడైన బండి సంజయ్ హస్తం ఉందని ఆరోపణలు వచ్చాయి. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి రాత్రి అదుపులోకి తీసుకున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. బండి సంజయ్‌కు హన్మకొండ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయన్ని కరీంనగర్ జైలుకు తరలించారు. ఆ తర్వాత కొన్నిరోజులకి ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ బండి సంజయ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తాజాగా ఈ కేసును కొట్టివేసింది. కోర్టు కేసు కొట్టివేయడం బీఆర్ఎస్‌కు చెంపపెట్టు అని బీజేపీ శ్రేణులు అంటున్నాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అండతో వరంగల్ కమిషనర్ గా ఉన్న రంగనాథే బండి సంజయ్‌ను జైల్లో పెట్టించేలా చేశారని బీజేపీ శ్రేణులు అప్పట్లో ఆరోపించారు. ఆ తర్వాత రంగనాథ్ వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. తాజాగా ఈ కేసులో బండిసంజయ్‌కు క్లీన్‌చిట్ రావడంతో రంగనాథ్‌పై కూడా బీజేపీ శ్రేణులు మండిపడుతున్నాయి. బండి సంజయ్ కూడా సత్యమేవ జయతే అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# మన్నె గోవర్ధన్ రెడ్డికి కేసీఆర్ బంపర్ ఆఫర్

## ఖైరతాబాద్ బరిలో పందెంకోడి ఆయనే?



**హైదరాబాద్, మహా:** ఖైరతాబాద్ ఉప ఎన్నికపై సర్వత్రా చర్చ జరుగుతున్న వేళ బీఆర్ఎస్ పార్టీ బరిలో ఉండే నేతలను అలర్ట్ చేసింది. గత రెండుసార్లు దానం నాగేందర్ కారణంగా నష్టపోయిన స్థానిక నేత, బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్ ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డినే బరిలో నిలపాలని డిసైడైనట్లు తెలిసింది. ఈ మేరకు అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లు గ్రౌండ్ వర్క్ ప్రారంభించాలని ఆదేశించినట్లు సమాచారం. బీఆర్ఎస్ వర్గాల్లో ఈ మేరకు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ఉద్యమ సమయం నుండి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో మంచి సంబంధాలున్న మన్నె గోవర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ లో పోటీకి పూర్తిగ్రౌండ్ వర్క్ చేసుకోగా, 2018 ఎన్నికల సమయంలో వచ్చి దానం నాగేందర్ సీటును ఎగరేసుకుపోయారు. హైదరాబాద్ లో పార్టీ లేని సమయం నుండి 2018 దాకా ఎంతో కష్టపడ్డ మన్నె గోవర్ధన్ రెడ్డికి పార్టీపరంగా అన్యాయం జరిగిందని, ఈసారి న్యాయం చేయాలని కేసీఆర్ స్వయంగా ముఖ్యనేతలతో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో ఎంజీఆర్ ఇప్పటికే పని ప్రారంభించారు. మన్నె గోవర్ధన్ రెడ్డికి దానం నాగేందర్ కారణంగా తీవ్రనష్టం జరిగిందని, 2018లోనే పార్టీ ఆఖరిక్షణంలో టికెట్ మార్చకుంటే ఇప్పటికి మన్నె గోవర్ధన్ రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యే అయి ఉండేవారని, స్థానిక నేతలు అంటున్నారు. జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ కు ఇంతకాలం అన్యాయం జరిగినట్లే, ఖైరతాబాద్ లో మన్నె గోవర్ధన్ రెడ్డికి అన్యాయం జరిగిందని.. ఈ సారి మళ్ళీ దానం నాగేందర్ రూపంలోనే అన్యాయం సరిదిద్దే అవకాశం లభించిందని, బైపోల్ లో ఖచ్చితంగా మన్నె గోవర్ధన్ రెడ్డి బంపర్ మెజారిటీతో గెలుస్తాడని బీఆర్ఎస్ వర్గాలు నమ్మకంగా చెబుతున్నాయి. మన్నె గోవర్ధన్ రెడ్డి కాకుండా.. బిఆర్ఎస్ మరే ప్రయోగాలు చేసినా జూబ్లీహిల్స్ తరహా ఫలితమే రిపీట్ అవుతుందని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.

# దానం, కడియంకు మరోసారి నోటీసులు

## అనర్హత పిటిషన్లపై అఫిడవిట్‌లు దాఖలు చేయాల్సిందేనన్న స్పీకర్

## మలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)





ఇప్పటి వరకు రిప్లై ఇవ్వని కడియం శ్రీహరి, దానం నాగేందర్‌కు తాజాగా నోటీసులు జారీ చేశారు. వారు తమ అఫిడవిట్‌లను తప్పనిసరిగా దాఖలు చేయాలని స్పీకర్ తన నోటీసుల్లో స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన కొన్ని నెలల్లోనే దాదాపు పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారారు. దీనిని తీవ్రంగా పరిగణించిన బీఆర్ఎస్.. వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ న్యాయపోరాటం స్టార్ట్ చేసింది. ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే మూడు నెలల్లో ఫిరాయింపు నేతలపై నిర్ణయం తీసుకోవాలంటూ ధర్మాసనం జూలై 31న ఆదేశించింది. అయినప్పటికీ వివిధ కారణాల వల్ల ఆ గడువులోగా స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలోనే ధర్మాసనం ఇచ్చిన గడువులోగా తీర్పు ఇవ్వలేకపోయామని, ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి తమకు మరో రెండు నెలల సమయం కావాలని కోరుతూ స్పీకర్ తరపున శాసనసభ కార్యదర్శి తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. కార్యదర్శి మిసిలేనియస్ దాఖలు చేసిన అప్లికేషన్ 14వ నంబరులో లిస్ట్ అయింది. సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అత్యున్నత న్యాయస్థానం ఈ అంశంలో స్పీకర్‌కు మరో నాలుగు వారాల సమయం ఇచ్చింది. ఇదే సమయంలో స్పీకర్ తీరుపై సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు కూడా చేసింది. దీంతో స్పీకర్ ఈ అంశంలో స్పీడ్ పెంచారు.

**ఢిల్లీకి దానం నాగేందర్..**

ఫిరాయింపులపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ వేగవంతం చేశారు. ఈ సమయంలో దానం నాగేందర్ హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ పెద్దలను ఆయన కలవనున్నారని తెలుస్తోంది. విచారణ నేటితో ముగిసినా కూడా ఆయన ఇప్పటివరకు అఫిడవిట్ దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే అనర్హత వేటు పడే అవకాశం ఉన్నందున ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్న ఆలోచనలో దానం ఉన్నట్లు సమాచారం. అనర్హత వేటు పడితే మళ్ళీ ఆరేళ్ల వరకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఉండదు. అప్పటివరకు వేచి చూస్తే నష్టమని, అనర్హత వేటు పడకముందే రాజీనామా చేస్తే నే మంచిదనే యోచనలో దానం ఉన్నారని తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ పై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల మాదిరిగా దానంకు తప్పించుకునే అవకాశాలు లేవు. కాంగ్రెస్ తరుపు నుంచి ఎంపీగా పోటీ చేయడమే అందుకు కారణం. ఇటీవల సుప్రీం కోర్టు స్పీకర్ ను గట్టిగా హెచ్చరించిన నేపథ్యంలో స్పీకర్ త్వరలోనే నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఈ రెండు రోజుల్లోనే రాజీనామా చేస్తేనే మంచిదని న్యాయ నిపుణులు దానంకు సూచించినట్లు తెలిస్తోంది. ఈ అంశాలపైనే పార్టీ పెద్దలతో చర్చించడానికి దానం ఢిల్లీకి వెళ్లాడని చర్చ జరుగుతోంది.

**విచారణ చివరి రోజు**

పార్టీ ఫిరాయింపుల కేసుల్లో విచారణ గురువారంతో ముగియనుంది. విచారణ ఆలస్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత కేసులను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ విచారణ ప్రక్రియను వేగవంతం చేశారు. రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను ఈరోజు పిలిపించారు. ఉదయం పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ పరిశీలించారు. ఇరు వర్గాల న్యాయవాదుల వాదనలు విన్నారు. మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ కల్వకుంట్ల సంజయ్ కేసు విచారణ జరిగింది.

# పదోసారి సీఎం పీఠంపై నితీశ్

- 17 ఏళ్లుగా పీఠంలో కొనసాగుతున్న రికార్డు
- పాట్నాలో అట్టహాసంగా ప్రమాణస్వీకార కార్యక్రమం
- నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం
- సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు
- కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు



**బిహార్, మహా:** జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణ స్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు.

**ఎన్డీయే కూటమి డబుల్ సెంచరీ..**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడీయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు.

**దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రిగా..**

నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.



# ఆటో కిరాయి వివాదం

## ఎయిర్ గన్‌తో కాల్పులు.. శంషాబాద్ లో కలకలం

**హైదరాబాద్, మహా:** ఆటో కిరాయి విషయంలో జరిగిన ఘర్షణలో ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపిన ఇద్దరు నిందితులను శంషాబాద్ రూరల్ పోలీసులు 24 గంటలలోపే అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్కూడ వద్ద సమీర్ దాస్ తన అల్లుడు పింటూ హతి, స్నేహితులతో పాతబస్తీకి వెళ్లడానికి ఆటో డ్రైవర్ రూ. 800 కిరాయి అడిగాడు. అయితే, సమీర్ దాస్ రూ. 500 మాత్రమే ఇస్తానని చెప్పడంతో ఘర్షణ తలెత్తింది. ఆగ్రహించిన ఆటోలో ఉన్న నిందితులు సమీర్ దాస్‌పై ఎయిర్ గన్‌తో కాల్చగా ఆయన కడుపులో గాయమైంది. మిగిలిన వారిని కూడా చంపేస్తామని బెదిరించడంతో బాధితులు పారిపోయారు. సమీర్ దాస్ ఫిర్యాదు మేరకు ఈ కేసును సవాలుగా తీసుకున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేశారు. నిందితులైన పసుముల అలియాస్ గుడుల చందు గౌడ్, సహకరించిన తూర్పాటి కృష్ణ అలియాస్ రామును అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఎయిర్ గన్ మరియు సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన బృందాన్ని శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఉగ్రవాదులకంటే వారే డేంజర్

## ఉగ్రకేసుల్లో మేధావుల ప్రమేయం మరింత ప్రమాదకరం

## సుప్రీం కోర్టులో ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ, మహా :** దేశ వ్యతిరేక చర్యల్లో మేధావుల పాత్ర పెరుగుతున్నదంటే అది సాధారణ అంశం కాదు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉగ్రవాదుల కంటే వీరే ఎక్కువ ప్రమాదకరమని దిల్లీ పోలీసులు సుప్రీం కోర్టుకు స్పష్టం చేశారు. 2020లో దిల్లీలో జరిగిన అల్లర్ల కేసులో నిర్బంధంలో ఉన్న ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ తదితర నిందితుల బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ పోలీసుల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు బలమైన వాదనలు వినిపించారు. 2020లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్ఆర్ సీ) వ్యతిరేకంగా దిల్లీలో జరిగిన భారీ నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు కొనసాగిన అల్లర్లలో 53 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ అల్లర్లకు సంబంధించి ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్ తదితరులపై మునుపటి ఐపీసీ సెక్షన్లతో పాటు ఉగ్రవాద నిరోధక చట్టం ఉపా కింద కేసులు బుక్ చేశారు. అప్పటి నుంచి వీరు దాదాపు ఐదేళ్లుగా నిర్బంధంలో ఉన్నారు. బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా, కేసు దర్యాప్తులో, విచారణలో జరిగిన ఆలస్యానికి నిందితులే ప్రధాన కారణమని ఏఎస్‌జీ రాజు ధర్మాసనానికి వివరించారు. ఈ జాప్యాన్నిఇప్పుడు బెయిల్ కారణంగా చూపించలేరని స్పష్టం చేశారు. 'వారు సాగదీస్తే దాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టించే ప్రయత్నం ఇది అని రాజు వాదించారు. శర్జీల్ ఇమామ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడన్న ఆరోపణను బలపరచేందుకు పోలీసులు సుప్రీం కోర్టులో సంబంధిత వీడియో క్లిప్స్‌ను ప్రదర్శించారు. ఇమామ్ ఒక ఇంజినీరింగ్గ్రాడ్యుయేట్ అని, ఇటీవలి కాలంలో ఒక ట్రెండ్మొదలైందని తెలిపారు. డాక్టర్లు, ఇంజినీర్లు తమ వృత్తి పనులు వదిలిపెట్టి దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం పెరిగింది. వీరి ప్రభావం ఎక్కువ, అందుకే వీరు మరింత ప్రమాదకరులని వ్యాఖ్యానించారు. నిరసనల అసలు ఉద్దేశ్యంపై కూడా దిల్లీ పోలీసులు సందేహాలు వ్యక్తం చేశారు. 'ఇవి సాధారణ ప్రజా ఆందోళనలు కావని చెప్పారు ఏఎస్‌జీ రాజు. హింసతో కూడిన సమన్విత ప్రణాళిక అని, అంతర్జాతీయ మీడియాలో ఇమేజ్ క్రియేట్చేసుకునేందుకు అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను ఉపయోగించుకున్నారని చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరం చేయడం, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడమే వీరి యాజమాన్య లక్ష్యమంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కేసు కేవలం సీఏఏ వ్యతిరేక ఉద్యమం కాదని, మతరంగ ప్రాతిపదికన సమాజాన్ని విభజించే కుట్ర అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా వాదించారు. నిరసనల పేరుతో దాగి ఉన్న పెద్ద ప్లాన్ ఇదని తెలిపారు. హింసకు దారి తీసిన సంఘటనలు ఒక్కసారిగా జరగలేదని, నిందితుల మధ్య జరిగిన సంభాషణలు, సమావేశాలు, విభిన్న ప్రాంతాల్లో జరిగిన కార్యకలాపాలు అని ఆయన పేర్కొన్నారు.

# హనుమంతుడిపై సినీ దర్శకుడి వ్యాఖ్యలు

- రాజమౌళిని జైల్లో పెట్టాలి
- ఆయన సినిమాను బహిష్కరించండి
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, మహా :** ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఓ కార్యక్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన రాజమౌళిని జైల్లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. దేవుళ్లపై నమ్మకం లేనప్పుడు, వారి పేరుతో సినిమాలు తీసి కోట్లాది రూపాయలు ఎందుకు సంపాదిస్తున్నారని రాజమౌళిని నిలదీశారు. ప్రభాస్‌తో 'బాహుబలి' సినిమా తీసి, అందులో శివలింగాన్ని ఎత్తించి కోట్లు సంపాదించుకుని, ఇప్పుడు హిందూ దేవుళ్లపై నమ్మకం లేదని మాట్లాడటం సరికాదన్నారు. హిందూ ధర్మంపై అభిమానం లేని రాజమౌళి సినిమాలను హిందువులంతా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'వారణాసి' సినిమా ప్రచారం కోసమే ఇలా మాట్లాడారా, లేక నిజంగానే నాస్తికులా అనే విషయంపై రాజమౌళి స్పష్టత ఇవ్వాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. రాజమౌళి హిందూ దేవుళ్లను కించపరచడం ఇది మొదటిసారి కాదని, గతంలో రాముడు, కృష్ణుడిపై కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. ఇలాంటి దర్శకుడిపై హిందువులు ఫిర్యాదులు చేయాలని ఆయన కోరారు.

# తెలంగాణ విద్యార్థుల చారిత్రక విజయం

## విద్యార్థులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రశంస

### జాతీయ వేదికపై గిరిజన విద్యార్థుల ప్రతిభ.. 230 పతకాలతో రికార్డు



**హైదరాబాద్, మహా:** ఒడిశాలోని రౌర్కెలా సుందర్‌గఢ్‌లో నవంబర్ 11 నుంచి 15 వరకు జరిగిన 4వ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) జాతీయ క్రీడా సమవేశం 2025లో తెలంగాణ విద్యార్థులు చారిత్రక విజయాన్ని నమోదు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈఎంఆర్ఎస్ పాఠశాలల మధ్య జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ జట్టు ట్రోఫీలను సొంతం చేసుకుని రాష్ట్ర గౌరవాన్ని పెంచింది. తెలంగాణలోని 23 ఈఎంఆర్ఎస్ సంస్థల నుండి 580 మంది విద్యార్థులు, 68 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరు తుపాకీ షూటింగ్, పరుగు పందాలు, బాక్సింగ్, దేహ దారుఢ్య విన్యాసాలు, జూడో, ఈత, తైక్వాండో, బరువులు ఎత్తడం, కుస్తీ, యోగా, బుట్టపందిరి ఆట, ఖోఖో వంటి విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 230 పతకాలు సాధించారు. ఈ ఘన విజయంపై గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం సచివాలయంలో తన గదిలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "రౌర్కెలాలో జరిగిన క్రీడా పోటీల్లో తెలంగాణ విద్యార్థులు సాధించిన 230 పతకాలు గిరిజన యువత ప్రతిభకు జాతీయస్థాయి గుర్తింపు" అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న నూతన క్రీడా విధానం, ఈఎంఆర్ఎస్‌లలో ప్రపంచస్థాయి క్రీడా వాతావరణం సృష్టించడంలో గొప్ప పాత్ర పోషించిందని మంత్రి చెప్పారు. ఈ విజయం తెలంగాణ ఈఎంఆర్ఎస్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమ క్రీడా సౌకర్యాలు, నైపుణ్యం, శిక్షణ అందిస్తుందనే దానికి నిదర్శనం అని అన్నారు. పతకాలు సాధించిన విద్యార్థుల క్రమశిక్షణ, శ్రమ, పట్టుదలను మంత్రి కొనియాడారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి కే. సీతాలక్ష్మి, ఈఎంఆర్ఎస్ అధికారులు, శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొని విజేతలను అభినందించారు.

# రూ. 161 కోట్లు రిలీజ్ చేయండి

- స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు భట్టి ఆదేశాలు
- గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతున్నాం: డిప్యూటీ సీఎం

**హైదరాబాద్, మహా:** పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2813 జూనియర్, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన రూ. 161 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని పలు కాలేజీలు పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిల కోసం పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలనే బంద్ కు కూడా పిలుపునివ్వగా... ప్రభుత్వం చర్చలు జరిపింది. దీంతో ఆయా కాలేజీలు వెనక్కి తగ్గాయి. చర్చల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2813 జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 161 కోట్లు వెంటనే విడుదల చేయాలని నిర్ణయించింది. ఆయా నిధులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతున్నామని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఓ ప్రకటన ద్వారా తెలిపారు విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, కళాశాలలకు అవసరమైన నిధులు నిరంతరాయంగా చేరేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కొద్దిరోజుల కిందట ఫీజు బకాయిలపై తెలంగాణలోని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు బంద్ నిర్వహించిన సంగతి తెలిసిందే. కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి ఆధ్వర్యంలో ఈ చర్చలు నిర్వహించారు. కాలేజీలతో జరిపిన చర్చలు సఫలం కావటంతో... నవంబర్ 8వ తేదీ నుంచి కాలేజీలు తెరుచుకున్నాయి.

# సన్నబియ్యం పంపిణీలో తెలంగాణ మోడల్

## దేశంలో ఎక్కడా లేని విధంగా సరఫరా చేస్తున్నాం

### దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

### నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి జోషితో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ భేటీ



**హైదరాబాద్, మహా:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా వినియోగ దారులకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి వివరించారు. హైదరాబాద్ నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి జోషితో ముఖ్యమంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలకు సన్నబియ్యం పంపిణీ అంశంపై ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు తినే బియ్యం సరఫరా చేసినప్పుడే ఆ సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ఆయన అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్నట్టుగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయంలో అవసరమైతే సమగ్రంగా అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి సూచనపై స్పందించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, పూర్తిస్థాయి అధ్యయనం జరిపిన తరువాత దేశ వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసు కుంటామని తెలిపారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# స్పీకర్‌ను కలిసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్

## నవీన్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ ప్రసాద్

**హైదరాబాద్, మహా:** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాసన సభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో ఈ భేటీ జరిగింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా స్పీకర్‌ను కలిసిన నవీన్ యాదవ్, ఈ సందర్భంగా తమ నియోజకవర్గ ప్రజల తరపున, వ్యక్తిగతంగా స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర శాసనసభ నిర్వహణలో స్పీకర్ పాత్రను అభినందించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. యువ ఎమ్మెల్యేగా ప్రజలకు మరింత చేరువై పని చేయాలని ఆకాంక్షించారు.

EDITORIAL
సంపాదకీయం

# మావోయిస్టు ఉద్యమ యోధుడు హిడ్మా





- గంట సోమన్న,
సీనియర్ జర్నలిస్ట్

భారతదేశంలోని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు కొరకరాని కొయ్యగా మారి,భద్రతా దళాలకు ఎప్పుడూ పట్టుబడని నాయకుడిగా, మావోయిస్టు (నక్సలైట్) ఉద్యమంలో అత్యంత కీలకమైన వ్యక్తిగా పేరొందిన మడ్వి హిడ్మా చరిత్ర 2025 నవంబర్ 18న ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మరణించడంతో ముగిసిపోయింది.ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల "బస్తర్ దెయ్యం"గా పిలుచుకున్న హిడ్మా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) సెంట్రల్ కమిటీలో అతి పిన్నవయస్కుడైన సభ్యుడుగా మరియు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్ జిఏ) బెటాలియన్ నంబర్ 1 కమాండర్ గా ఎదిగిన ఆయనపై రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బహుమతి ప్రకటించారు.

## మడ్వి హిడ్మా ప్రస్థానం

1981లో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువర్తి గ్రామంలో మురియా గోండ్ ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. 5వ తరగతి(నిర్దిష్టంగా తెలియదు)వరకు మాత్రమే చదివాడు.1991లో కేవలం 1012 ఏళ్ల వయసులో బాల సంఘం(మావోయిస్టుల చైల్డ్ క్యాడర్) సభ్యుడిగా చేరాడు.సీనియర్ నాయకులు రమణ్ణ మరియు బద్రన్న (రమేష్ పుడియామి) ఆయనను రిక్రూట్ చేశారు. ఉద్యమంలోకి ప్రవేశించాక హిడ్మాకు సంతోష్,దేవా,దేవ్, అనిల్ వంటి మారుపేర్లతో పిలిచేవారు.బాల్యం నుండి హిడ్మా పూర్తిగా మావోయిస్టు ఉద్యమంలోనే పెరిగాడు. ఆదివాసీల అణచివేత, అడవుల హక్కులు వంటి సమస్యలు ఆయనను ఉద్యమం వైపు ఆకర్షించాయి.

## మావోయిస్టు ఉద్యమంలో అంచెలంచెలుగా ఎదుగుతూ

మావోయిస్టు ఉద్యమంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూ 1990 ల చివరలో సంఘం సభ్యుడిగా తర్వాత ప్లటూన్ కమాండర్‌గా పదోన్నతి పొందాడు .2000ల ప్రారంభంలో పిఎల్ జిఏలో చేరి,దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో కీలక సభ్యుడయ్యాడు. పిఎల్ జిఏ బెటాలియన్ నంబర్ 1 కమాండర్‌గా నియమితుడయ్యాడు.ఇది మావోయిస్టుల అత్యంత శక్తివంతమైన మరియు మొబైల్ యూనిట్ .చిన్న వయసులోనే సిపిఐ మావోయిస్టు సెంట్రల్ కమిటీలో సభ్యుడయ్యాడు. బస్తర్ నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదిగిన ఏకైక ఆదివాసీ నాయకుడుగా హిడ్మా ఉద్యమంలో పట్టు సాధించాడు.ఉద్యమంలో మావోయిస్టు మొబైల్ పొలిటికల్ స్కూల్ హెడ్ మడకం రాజే (రాజక్క)ను వివాహం చేసుకున్నాడు. ఆమె కూడా మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో భర్తతో పాటు మరణించింది.హిడ్మా గెరిల్లా యుద్ధ వ్యూహాల్లో నిపుణుడు.అడవుల భూభాగాన్ని బాగా తెలుసుకుని,ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌తో ఎప్పుడూ ముందుండేవాడు.మావోయిస్టు ఉద్యమంలో జరిగిన ప్రధాన దాడుల్లో హిడ్మా ప్రమేయం ఉన్నట్లు,హిడ్మాపై 26 కంటే ఎక్కువ కేసులు ఉన్నాయని భద్రతా బలగాలు ఆరోపిస్తున్నాయి.

## హిడ్మా సారథ్యంలో ఘోరమైన దాడులు

హిడ్మా సారథ్యంలో జరిగిన 26 కంటే ఎక్కువ దాడుల్లో 250 మందికి పైగా భద్రతా సిబ్బంది మరణించారు. 2010 ఏప్రిల్ లో దంతెవాడ (చింతల్‌నార్ లేదా తడ్మెట్లా) దాడిలో 76 సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించడం మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద దాడి.2013 మేలో ఝీరం ఘాటీ (దర్భా వ్యాలీ) దాడిలో కాంగ్రెస్ నాయకులు మహేంద్ర కర్మ,నందకుమార్ పటేల్ సహా 27 మంది మరణించారు.2017లో జరిగిన సుక్మా దాడుల్లో 37 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.2021 ఏప్రిల్ లో సుక్మాబీజాపూర్ (తర్రెం) దాడిలో 22 జవాన్లు మరణించారు.ఇలాంటి ఉద్యమ దాడులకు వ్యూహకర్తగా,ఫీల్డ్ కమాండర్‌గా హిడ్మా పాత్ర కీలకంగా ఉండేది.


## చిక్కడు దొరకడు బక్కపలుచని హిడ్మా

మావోయిస్టు ఉద్యమంలో దశాబ్దాలుగా భద్రతా బలగాలకు చిక్కకుండా తప్పించుకోవడంలో దిట్ట. కనీసం ఆయన ఫోటో కూడా సరిగా లేదు.2025లోనే ఒక క్లియర్ ఫోటో వచ్చింది, మరణం కూడా 2025 లోనే జరిగింది.2016లో అరెస్టు అయినా తక్కువ స్థాయి సభ్యుడిగా చూపి విడుదల చేశారు.ఇక అప్పటి నుండి (20212025) జరిగిన భారీ ఆపరేషన్‌ల నుంచే గాక, కర్రెగుట్ట హిల్స్‌లో 31 మంది మావోయిస్టులు చనిపోయినా హిడ్మా మాత్రం తప్పించుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కగార్ ఆపరేషన్ మూలంగా మావోయిస్టు ఉద్యమంలో చీలిక ఏర్పడి అనేకమంది ముఖ్య నాయకులు ప్రభుత్వానికి లొంగిపోయిన విషయం తెలిసిందే.కానీ, హిడ్మా మాత్రం తన పోరాట పంథాను కొనసాగించాడు. చివరికి 2025 నవంబర్ 18న ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ మరియు స్థానిక పోలీసులు నిర్వహించిన ఆపరేషన్‌లో హిడ్మా ,ఆయన భార్య రాజే సహా 6 మంది మావోయిస్టులు మరణించారు.ఇది మావోయిస్టు ఉద్యమానికి భారీ దెబ్బగా భావిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి 31లోపు మావోయిజాన్ని అంతం చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో హిడ్మా మరణం ఉద్యమ ప్రస్థానంలో ఒక మైలురాయి చూడాలి. మావోయిస్టు విప్లవోద్యమంలో హిడ్మా జీవితం ఆదివాసీల ఆవేదనగా,రాజ్య హింస మరియు గెరిల్లా యుద్ధం మధ్య సంఘర్షణగా ప్రతిబింబిస్తుంది.ఆయన మరణంతో బస్తర్‌లో మావోయిస్టు ఉద్యమం బలహీనపడినట్లు ప్రభుత్వాలు భావిస్తున్నాయి.

## ప్రమాదకరమైన టార్గెట్‌గా హిడ్మా మారడానికి ముఖ్య కారణాలు

ఒక సాధారణ ఆదివాసి బిడ్డ మడ్వి హిడ్మా దేశ పాలకులకు అత్యంత ప్రమాదకరమైన టార్గెట్ గా మారడానికి అనేక కారణాలు కనిపిస్తాయి.ఆదివాసీలపై దీర్ఘకాల అన్యాయమే మావోయిస్టు ఉద్యమానికి మూలమని చెప్పాలి.బస్తర్ (ఛత్తీస్‌గఢ్) ప్రాంతంలో ఆదివాసీల భూములను కార్పొరేట్ మైనింగ్ కోసం లాగేసుకుపోయారు.దీనిని అడ్డుకున్న ఆదివాసీలను అణచివేసేందుకు ప్రభుత్వం సాల్వా జుడుం అనే ప్రత్యేక దళాలను ఏర్పాటు చేసి వారికి తుపాకులు ఇచ్చి, 2005 నుండి 09 వరకు వేలాది మంది ఆదివాసీలను ఇళ్ల నుంచి బలవంతంగా తరలించి క్యాంపుల్లో బంధించారు.పోలీసులు, సాల్వా జుడుం గూండాలు ఆదివాసీ యువతను హత్యలు చేస్తూ సాధించిన మారణకాండ,ఆదివాసీ మహిళలను అత్యాచారాలు చేస్తూ ఈ మొత్తం అరాచక పర్వాన్ని మావోయిస్టులపై నెట్టాయి. హిడ్మా కేవలం 1012 ఏళ్ల బాలుడిగా ఉన్నప్పుడే (1991లో) ఈ అన్యాయాలను చూసి బాల సంఘంలో చేరాడు.ఆ కసి పట్టుదలతో అత్యంత నిపుణుడైన గెరిల్లా కమాండర్‌గా ఎదిగాడు. అడవుల భూభాగాన్ని గుడ్డిగా తెలిసిన వ్యక్తిగా ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ను అద్భుతంగా అమలు చేశాడు.దశాబ్దకాలంగా వేలాది మంది జవాన్లు, డ్రోన్లు,హెలికాప్టర్లతో వెతికినా పట్టుబడలేదు.ఎన్నోసార్లు "హిడ్మా చనిపోయాడు" అని ప్రకటించి తర్వాత ఆ పేరు వేరే వాడిదని తేలిందని సవరించుకున్నారు.ఇది భద్రతా బలగాలకు అవమానంగా మారింది.ఇదే హిడ్మా మావోయిస్టు ఉద్యమానికి చిహ్నంగా మారడానికి కారణమైంది. ఒక సాధారణ ఆదివాసీ బిడ్డ రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వ యంత్రాంగానికి సవాలు విసురుతున్నాడన్నది పాలకులకు రాజకీయంగా ఇబ్బందికరంగా ,అవమానకరంగా మారింది.అందుకే ఆయన్ని అంతం చేయడం ద్వారా "మావోయిజం అంతమైంది" అని ప్రచారం చేయాలని కేంద్రం కోరుకుంది.అందులో భాగంగానే 2026 మార్చి 31లోపు మావోయిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం ,దానికి అనుకూలంగా "కగారు ఆపరేషన్" పేరుతో జరిగే భద్రత బలగాల కూంబింగ్ లో హిడ్మా అతి ముఖ్యమైన టార్గెట్ గా మారాడు.ఒక ఆదివాసీ బిడ్డ రాష్ట్ర హింసకు బదులుగా తుపాకి ఎత్తడం,దాన్ని అత్యంత నైపుణ్యంతో నిర్వహించడం, ఎప్పుడూ పట్టుబడకుండా ఉండడం ఇవన్నీ కలిసి హిడ్మాను దేశ పాలకులకు "నంబర్ వన్ ఎనిమీ"గా మార్చాయి. ఆయన కథ ఆదివాసీల ఆవేదన, రాష్ట్ర దమనకాండ,గెరిల్లా పోరాటం మధ్య సంఘర్షణను సూచిస్తుంది.

# దశ మహావిద్యల గురించి ఎప్పుడైనా విన్నారా?



మహేశ్ బాబు రాజమౌళి కాంబినేషన్లో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం వారణాసి. ప్రపంచ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేలా ప్రమోషన్ ప్రారంభించిన జక్కన్న.. ఈ మూవీ టైటిల్ తో పాటూ టీజర్ కూడా రిలీజ్ చేశారు. ప్రతి ఫ్రేమ్ ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంది.. చిన్న గ్లింప్స్ తోనే తన సినిమా ఎలా ఉండబోతోందో చెప్పడమే కాదు.. ఏ ఏ విషయాలు కవర్ చేయబోతున్నారో హింట్ ఇచ్చి వదిలారు. చిన్న టీజల్లో అందర్నీ ఆకర్షించిన విగ్రహం ఓ గుహలో తల చేత్తో పట్టుకుని రక్తం తాగే మొండెం ఉన్న అమ్మవారి విగ్రహం. కాళీ మాత అనుకున్నారంతా.. కానీ ఆ దేవతా రూపం పేరు చిన మస్త దేవి. దశ మహావిద్యల్లో ఓ విద్యకు ఈమె అధినేత్రి. దశ మహావిద్యల్లో చిన మస్త ఒకరైతే..మిగిలిన తొమ్మిది మంది ఎవరు? ఎవరు దేనికి సంకేతం? వివిధ పుస్తకాలు, మీడియాల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా అసలు తాంత్రిక దేవతలు మొత్తం పది. తాంత్రిక సాధనలో అత్యంత శక్తివంతమైన పాత్ర పోషిస్తాయ్ దశమహావిద్యలు. జ్ఞానస్వరూపిణి అయిన ఆదిపరాశక్తి పార్వతీదేవి పది రూపాలే దశ మహావిద్యలకు అధిపతి. ఇవి శక్తి ఉపాసనలో అత్యంత గోప్యమైనవి.

## దశ మహావిద్యలు - అధిదేవత పేరు

**కాళీ మహావిద్య**

ఈ విద్యకు అధిదేవత శ్రీ మహాకాళి కాలం, మరణం, వినాశనం, మోక్షం, అజ్ఞాన నాశనానికి ప్రతీక

**తారా మహావిద్య**

శ్రీ తారా దేవి మోక్షప్రదాయిని, దుఃఖ తారణం, బౌద్ధ తాంత్రికులకూ పవిత్ర రూపం ఇది

**త్రిపురసుందరీ (షోడశీ)**

శ్రీ లలితాంబిక / శ్రీవిద్య సౌందర్యం, శృంగారం, జ్ఞానం, ఐశ్వర్యం, షోడశ కళల స్వరూపిణి

**భువనేశ్వరీ**

శ్రీ భువనేశ్వరి సమస్త విశ్వానికి అధిపతి, ఆకాశ తత్త్వం, సృష్టి పాలన

**భైరవీ (త్రిపురభైరవీ)**

శ్రీ త్రిపురభైరవి తేజస్సు, యోగసాధన, కఠిన తపస్సు, శివుని శక్తికి రూపం

**చిన మస్త**

శ్రీ చిన మస్త దేవి తన కంఠాన్ని తానే ఛేదించుకుని రక్తం తాగే స్వరూపిణి - ఆహారం (ప్రాణం) మీద అధికారం, కుండలినీ జాగృతి, అహంకార నాశనానికి ప్రతీక

**ధూమావతీ**

శ్రీ ధూమావతీ దుఃఖం, దారిద్ర్యం, ఒంటరితనం, తామస గుణం, అతీత జ్ఞానానికి ప్రతీక

**బగళాముఖీ**

శ్రీ బగళాముఖీ శత్రు నాశనం, వాక్స్తంభన, విజయం, రాజస శక్తికి ప్రతీక

**మాతంగీ**

శ్రీ మాతంగి (రాజశ్యామల) వాక్కు, కళలు, సంగీతం, జ్ఞానం, మంత్రసిద్ధి రూపం

**కమలాత్మికా (కమలా)**

శ్రీ మహాలక్ష్మి ఐశ్వర్యం, సంపద, సౌభాగ్యం, సౌందర్యం, సత్వగుణ స్వరూపిణి. ఈ పది రూపాలను దశమహావిద్యలు అంటారు. ఈ 10 రూపాలు కలిపి సమస్త సృష్టిస్థితిలయలను... మూడు గుణాలను (సత్వ రజస్తమస్), మూడు కాలాలను (భూత భవిష్యత్‌వర్తమాన), అన్ని విధాలైన శక్తులను ప్రతినిధీకరిస్తాయి.

- మహా డెస్క్

# నేపాల్‌లో మళ్లీ జెన్ జెడ్ నిరసనలు

మళ్ళీ అలజడి. పొరుగు దేశం నేపాల్‌లో మరోసారి జెన్ జెడ్ నిరసనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత పాలకుల మద్దతుదారులు, యువ నిరసనకారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడంతో అప్రమత్తమైన ప్రభుత్వం పలుచోట్ల కర్ఫ్యూ అమల్లోకి తీసుకొచ్చింది. ఎక్కువ సంఖ్యలో ఒకచోట గుమిగూడటం నిషేధించింది. ఈ సెప్టెంబరులో నేపాల్ యువత అవినీతికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారి పదుల సంఖ్యలో చనిపోగా.. వందల మంది గాయపడ్డారు. జెన్ జడ్ నిరసనల దెబ్బకు ప్రధాని కేపీ శర్మ ఓలీ, ఆయన మంత్రులు రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇపుడు మళ్ళీ బుధవారం బారా జిల్లాలో జెన్‌జెడ్ ఆందోళనకారులు, కేపీ ఓలీ అనుచరులు పోటీపోటాగా ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలు మొదలైన కాసేపటికే ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. విమానాశ్రయం సమీపంలోనూ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. దాంతో కర్ఫ్యూ విధించి, గురువారం రాత్రి వరకు అమల్లో ఉంటుందని ప్రకటించారు. అవసరమైతే దీనిని పొడిగిస్తామని తెలిపారు. ప్రస్తుతం బరా జిల్లాలో పరిస్థితి అదుపులో ఉందని, ఎవరికీ తీవ్రగాయాలు కాలేదని నేపాల్ పోలీస్ అధికార ప్రతినిధి అబి నారాయణ్ కఫ్లే పేర్కొన్నారు. మరోవైపు, సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు భద్రతా దళాలు సిద్ధంగా ఉండాలని తాత్కాలిక ప్రధాన మంత్రి జస్టిస్ సుశీలా కార్కీ ఆదేశించారు. రాజకీయంగా రెచ్చగొట్టే ప్రచారానికి దూరంగా ఉండాలని, ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలు విశ్వాసం ఉంచాలని ఆమె పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల స్వేచ్ఛగా తిరిగేలా.. ఎన్నికలకు న్యాయమైన, శాంతియుత వాతావరణాన్ని సృష్టించాలని తాను కోరుకుంటున్నట్లు ఆమె చెప్పారు. నేపాల్ తాత్కాలిక ప్రధాని 110కిపైగా రాజకీయ పార్టీలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. "ఈ దేశం కొత్తతరం చేతుల్లో ఉండాలని,దార్శనికత కలిగిన వ్యక్తులు పాలనలో కొనసాగాలని మేము కోరుకుంటున్నాం" అని ఆమె సమావేశంలో అన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో సోషల్ మీడియాపై అప్పటి కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం నిషేధం విధించడంతో యువతలో ఆగ్రహం పెల్లుబికింది. చివరకు ఇది అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారింది. పార్లమెంట్, కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పంటించారు. దీంతో కేపీ శర్మ ఆయన క్యాబినెట్ మంత్రులు పదవి నుంచి తప్పుకున్నారు. ఆ క్రమంలోనే నేపాల్ సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీల కార్కీ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. వచ్చే ఏడాది మార్చి 5న అక్కడ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేలా తాము పనిచేస్తామని గతంలోనే ఆమె వెల్లడించారు. ఇపుడు మళ్ళీ నిరసనలు మొదలు కావడం ఆందోళన కలిగించే పరిణామంగా ఉంది. నేపాల్ లో శాంతి నెలకొల్పే ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆశిద్దాం.

- మహా డెస్క్



## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

mahaapatrika@gmail.com

whatsapp: 74369 39999

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని అన్నారు. ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని వివరించారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్ స్థలాలు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. విద్యుత్ శాఖ అధికారులు రహదారుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచనలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలను రోడ్డు భద్రత నియమాలపై చైతన్య పరచాలని తెలిపారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ దిశగా జాగ్రత్త సూచికలు, బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, కల్వర్టుల వద్ద షోల్డర్, రేడియంతో సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు తరలించేందుకు మున్సిపల్ అధికారులు పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం డి.సి.పి. భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం చలి కాలంలో పొగమంచు దృష్ట్యా వాహనదారులు నిర్ణీత వేగంలో వాహనాలను నడపాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని తెలిపారు. రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" నినాదంతో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఓవరాల్ ఛాంపియన్ ఆసిఫాబాద్

**కుమురం భీం ఆసిఫాబాద్ మహా :** గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడాసంబరాలు రెండురోజుల పాటు అట్టహాసంగా జరిగాయి. గురువారం ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ,గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి హాజరయ్యారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్ వంటి విభాగాల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు.ఈ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించిన ఆసిఫాబాద్ డివిజన్ ఓవరాల్ ఛాంపియన్ గా నిలవడం పట్ల అధికారులు క్రీడాకారులను అభినందించారు. క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని అధికారులు విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సంవత్సరం 248 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు..కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి మడావి శేఖు,ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్, మంచిర్యాల ఏసీఎంఓ లక్ష్మయ్య, జీసీడీవో శకుంతల, క్రీడా అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచులు, టీడబ్ల్యూఎస్టియు నాయకులు రాథోడ్ రవీందర్, కుడ్మేత అనంత్, శ్యాంరావ్ తదితరులు హాజరయ్యారు.



## మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర మత్స శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గురువారంరోజు కసిపేట మండలంలోని పలు గ్రామాలలో చేప పిల్లల పంపిణీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రత్నం ప్రదీప్ సూచనతో అందజేశారు. కాసిపేట మండల కేంద్రంలో వివిధ గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న చెరువులలో మత్స్యకారులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో మండల కేంద్రంలో మత్సకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబనను మత్స్యకారులు సాధించాలని సదుద్దేశంతో చేప పిల్లల పంపిణీనీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు ముత్యంపల్లి కార్య దర్శి మేఘన,కోమటిచెను ఉదయ్,ధర్మారావుపెట అన్నపూర్ణ,రొట్టెపల్లి సౌందర్య,ఫిషరి అస్సిటెంట్ నీల కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్,గోలేటి స్వామి,సిరాజ్ ఖాన్,జాడి శంకర్,షారూఖ్,తోడేటి ప్ర శాంత్,అక్కిపల్లి రాజేష్,మెరుగు శ్రీనివాస్,బాకీ నరేష్,బొగ్గుల నర్సయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

**ఆదిలాబాద్ మహా :** సీనియర్ సిటిజన్లకు సముచిత గౌరవం లభించినప్పుడే సమాజం మరింత ప్రగతి సాధిస్తుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులందరికి శుభాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ యాక్ట్ ను తీసుకువచ్చిందని, ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ పూర్తి ఆస్తిని పిల్లలకు ఇవ్వకుండా కొంత భాగాన్ని తమ భద్రత కోసం ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు సంరక్షణ చేయని పక్షంలో కలెక్టర్ లేదా ఆర్డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తిరిగి ఆస్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. దస్నాపూర్‌లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక భవనం నిర్మించి ఇంచార్జి మంత్రిచే ప్రారంభించుకున్నామని, అక్కడ డే కేర్ కేంద్రం కూడా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా వయోవృద్ధుల సంరక్షణ టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, పలువురు వయోవృద్ధులను మెమెంటోలతో సత్కరించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును కలెక్టర్ సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమైక్య సభ్యులు దేవిదాస్, లక్ష్మారెడ్డి, అధికారులు, వైద్యులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు అన్యాయం జరిగితే ఊరుకోం..

**ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ సమితి**



**జైనూర్ మహా :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కొరకు ఇటీవల పత్రికలలో ప్రచురితమైన ప్రకటనలో ఆదివాసులకు చాలా అన్యాయం జరిగిందని ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. శాన్వి సర్వీసెస్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పేరుతో ఇటీవల విడుదలైన ఉద్యోగ ప్రకటనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉద్యోగ ప్రకటన ఇచ్చిన ఏజెన్సీ , ఆదివాసులకు ఏ ఒక్క పోస్టు నందు కూడ రిజర్వేషన్ కల్పించకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి రంగాలలో అన్యాయం జరిగితే ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. శాన్వి ఏజెన్సీ ఉద్యోగ ప్రకటనను వెంటనే రద్దు చేసి, స్థానికంగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ లకు అవకాశాలు కల్పించాలని అన్నారు. ఇతర జిల్లాల నుండి ప్రజాప్రతినిధుల అండతో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను దక్కించుకొని వివిధ శాఖలలో పనిచేస్తున్న వారికి జీతాలు కూడా సరిగా ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే ఔట సోర్సింగ్ ఏజెన్సీ లను బ్లాక్ లిస్ట్ లో పెట్టి కొత్తవారికి ఆవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

**మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి వెల్లడి**

**మందమర్రి, మహా :** మంతమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల నివారణకు గురువారం స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాపల్, కే.కే 2, ఓ.సి.పి ప్రాంతాలలో తరచుగా జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, జాతీయ రహదారి అధికారులు, మందమర్రి పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సర్వీస్ రోడ్లలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు శాశ్వత పరిష్కారంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గతంలో ఈ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం, గాయాలు సంభవించాయని చెప్పారు. ప్రత్యేకించి, యాపల్ ఏరియాను రోడ్డు ప్రమాదాలకు 'బ్లాక్ స్పాట్'గా ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ తీవ్రతను పరిగణలోకి తీసుకుని, మందమర్రి పోలీసులు తమ వంతు కృషిగా జాతీయ రహదారి అధికారులతో సమన్వయం చేసుకుని ఈ భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇకనుండి పోలీసుల సూచనలను ప్రయాణికులు పాటించి, స్పీడ్ బ్రేకర్ల, సర్వీస్ రోడ్లలో నిదానంగా ప్రయాణించి, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు భద్రతకు సహకరించాలని శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్



**కొమురం భీం ఆసిఫాబాద్ మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ మహా జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందం చర్యలను వేగవంతం చేసింది. గురువారం తెల్లవారు జామున కొమురం భీం ఆసిఫాబాద్ మండలం యెల్లారం గ్రామంలో ఆకస్మిక దాడి నిర్వహించిన బృందం, పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది.దాడిలో నిందితుల వద్ద నుంచి రూ.4,400 నగదు, 52 పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుని ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. అనంతరం యెల్లారం గ్రామానికి చెందిన జూదరులు కొట్రాంగి తిరుపతి, మాందోరే హరి, చాటారే మారుతి, చౌధరి గంగారాం, వడాయి జిమ్నాజీ, చాటారే సోము, మాందోరే వాగు పై కేసులు నమోదు చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ జూదం సమాజంపై చూపుతున్న దుష్ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలను పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరార

## బెల్లంపల్లి శిశు మందిర్ రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం

- రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్
- వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు బందోబస్తు

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి లోని శిశు మందిర్ రోడ్డువిస్తరణ పనులను గురువారంరోజు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ నిర్వహించారు.శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేలా వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.పట్టణ అభివృద్ధిలో భాగంగా శిశు మందిర్ రోడ్డు విస్తరణ పనులను 30 ఫీట్లకు వెడల్పు చేసేందుకు నిర్ణయించి జెసిబి యంత్రాల సహాయంతో అడ్డుగా ఉన్న సముదాయాలను తొలగించారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగాగతంలో ఇదివరకే మార్కింగ్ చేసి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత వ్యక్తులు తొలగించకగడువు ముగియడంతో రోడ్డు విస్తరణ పనులను చేపట్టేందుకు నిర్ణయించినట్లు కమిషనర్ తెలిపారు.నేటి పరిస్థితులకు అనుగుణంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి వస్తుందని అందుకు పట్టణవాసులందరూ సహకరించాలని కమిషనర్ రమేష్ సూచించారు.

## కేటీఆర్ పై కక్ష్య సాధింపు చర్యలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే

**వరంగల్ మహా;** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కక్ష్య సాధింపు చర్యలను వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్ లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్ బీజేపీ పార్టీలు కలిసి బీఆర్ఎస్ పార్టీ పై కుట్రలు చేస్తున్నాయనేది తేట తెల్లామైందని అన్నారు. బీఆర్ఎస్ ను కట్టడి చేయడానికి కేటీఆర్ ను ఎదుర్కోవడానికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకుదమ్ము లేక ఇలా అక్రమ కేసుల్లో ఇరికించడానికి ఇరు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేఖత వచ్చినపుడు, ఎలక్షన్లు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్ పై విచారణ పేరుతో కొండను తవ్వి ఎలుకను పట్టలేక పోయారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్ష్యపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపిందని అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్ ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఫార్ములా ఈ కార్ రేస్ తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన కేటీఆర్ ను అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే అవుతుందని మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కేటీఆర్ కు బిఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉందని మీరు చేసే కుట్రలను న్యాయ స్థానాల్లోనే ఎదుర్కొంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రిజర్వేషన్‌లు లేకుండా స్థానిక ఎన్నికలు జరిపితే ఊరుకునేదిలేదు

**కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలి**

**బీసీ సమాజ్ రాష్ట్ర నాయకులు నరెడ్ల శ్రీనివాస్**



**మంచిర్యాల, మహా :** 42 శాతం రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలు జరిపితే ఊర్కునేదిలేదని బీసీ సమాజ్ రాష్ట్ర నాయకులు నరెడ్ల శ్రీనివాస్, ఎండి అబ్బాస్, బర్ల సదానందం, నస్పూరి తిరుపతి లు హెచ్చరించారు. గురువారం మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బీసీలకు న్యాయం గా రావాల్సిన హక్కుల గురించి ప్రతి ఒక్కరూ పోరుబాట నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగ సవరణ కోసం పార్లమెంట్ లో ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేయాలని వారు కోరారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 130 సార్లు రాజ్యాంగ సవరణలు చేశారని వారు తెలిపారు. అలాగే ఏ ఉద్యమం లేకుండానే అగ్రకులాలకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 103ను ఐదు రోజుల్లో సవరణ చేసి 10 శాతం ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కల్పించిందని వారు వివరించారు. గత 40 సంవత్సరాలుగా బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షులు చిలగాని సుదర్శన్, ఒజ్జా సాగర్ బాబు, దూడపాక రాజేందర్, శనిగారపు జనార్ధన్, బిసి సమాజ్ నాయకులు వెన్నంపల్లి రవీందర్, అంకం సాగర్, శీలం మహేందర్, డాక్టర్ పోషం,కంది తిరుపతి పిల్లి మల్లేష్, బర్ల శేఖర్ తదితర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలి.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఇసుక లభ్యత, రవాణా ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి ఇసుక అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి నిత్యం పర్య వేక్షించాలన్నారు. జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న చోట్ల నుండి ఆయా ప్రాంతాల తాహసిల్దారులు నీటిపారుదల శాఖ, భూగర్భ గనుల శాఖ అధికారులు సమన్వయం చేసుకొని ఇసుక మాఫియా పై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక తవ్వకం, రవాణా పై కఠిన నిఘా పెట్టాలని అనుమతి లేని ఇసుక తరలింపు జరుగుతున్నట్లయితే వెంటనే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ముఖ్యంగా విజిలెన్స్ బృందాలను శక్తివంతం చేసి రోజువారీ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జిల్లా భూగర్భ గనుల శాఖ ఏ డి రవి శంకర్, ఆర్డీవోలు ఉమారాణి, సుమా, తహశీల్దార్ల వెంకటస్వామి, విజయ సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలలు భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** బాలలు భయాన్ని వీడి జీవితంలో ధైర్యంగా ముందుకు సాగాలని ప్రశ్నించడం నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ యూనిట్, డాన్బాస్కో ఎన్.జీ.ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకథాన్ ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కాశీబుగ్గ నుండి ఓ సిటీ గ్రౌండ్స్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పాఠశాలలు, బాలల సంరక్షణ సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఓ సిటీ గ్రౌండ్స్ లో జరిగిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి నుండి బయట పడాలంటే వారి భయాన్ని వదిలి గొంతెత్తి ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ప్రతీ పిల్లవాడు ఆరోగ్య కరమైన, ఆహ్లాద కరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. బాలలు వారి హక్కుల పట్ల అవగాహన కలిగి ఉంటూనే బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పాఠశాలల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు అందుబాటులో ఉన్న పిర్యాదుల పెట్టెలను ఉపయోగించు కోవాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మాట్లాడుతూ బాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా బాలల సంరక్షణ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు పనిచేస్తున్నాయని, అత్యవసర సహాయం కోసం 1098 కు ఫోన్ చేసి సంప్రదించి వారి సమస్యలకు పరిష్కారాన్ని పొందాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబర్చిన వారికి కలెక్టర్, ఆదనపు కలెక్టర్ లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సాంబశివ రావు, జిల్లా యువజన, క్రీడాల అధికారి అనిల్, జిల్లా బాలల సంక్షేమ అధికారి ఉమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వసుధ, సభ్యులు మధు, షాహెదా, సుజాత, మండల విద్యా అధికారి వెంకటేశ్వర రావు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ కల్పన,డాన్బాస్కో ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ సంతోష్, షేర్ ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ ఆశయ సాధనకు మనమందరం కృషి చేయాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ మహా;** దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆశయ సాధనకు కృషి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. గురువారం ఆటో నగర్ లో గల ప్రభుత్వ బాలల పరిశీలక గృహం లో బాలల సంక్షేమం సంస్కరణల సర్వీసులు, వీధి బాలల సంక్షేమ శాఖ వరంగల్ వారి ఆధ్వర్యం లో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల ముగింపు ఉత్సవానికి (నవంబర్ 14 నుండి 20 వరకు)మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ పిల్లలు తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చి దిద్దు కోవడానికి కృషి చేయాలని మాజీ ప్రధాని నెహ్రూ చూపిన బాటలో నడవాలని ఉత్తమ పౌరులుగా సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని అవకాశాలను అంది పుచ్చుకోవాలని, మత్తు పదార్థాలకు దూరం గా ఉండాలని ఉన్నతంగా ఎదగడానికి అవసరం ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని మేయర్ పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమం లో జువైనల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు గోపికా రాణి, సుభాష్ సూపరిండెంట్ రమణ మూర్తి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.





## మతాలకు ఆదర్శంగా నిలుస్తున మహమ్మద్ అలీ

**అయ్యప్ప స్వాములకు అన్నదానం**

**మొయినాబాద్ మహా :** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగరలో 41 రోజుల పాటు మండలకాలం దీక్షలో ఉన్న అయ్యప్పస్వామి భక్తులకు అదే గ్రామానికి చెందిన ముస్లిం వ్యక్తి మహ్మద్ అలీ బిక్షను (అన్నదానం) గురువారం ఏర్పాటు చేశాడు. హిమాయత్ నగర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి సన్నిదానం స్వాములకు అన్నదానం ఏర్పాటు చేసి ఆయన మత సామరస్యాన్ని చాటి చెప్పాడు. వారి పక్కనే కూర్చొని భోజనం చేశారు. ప్రతి ఏడాది అయ్యప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నానని.. భగవంతుని ఆశీర్వాదంతోనే తాను కొద్దిపాటి సహాయం చేస్తున్నానని చెప్పారు. తనకు సహకరిస్తున్న అయ్యప్ప భక్తులకు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నిదానం గురుస్వామి మురళి గురుస్వామి, మహేందర్ యాదవ్ గురుస్వామి సన్నిదానం స్వాములు ఉన్నారు.



## వరంగల్‌లో బిజెపి శ్రేణుల సంబరాలు

**వరంగల్ మహా;** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పై ఉన్న టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీ అంటూ గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ తప్పుడు కేసులు ఎప్పుడు న్యాయస్థానాల్లో నిలబడవని కచ్చితంగా న్యాయం గెలిచే తీరుతుందని గత బిఆర్ఎస్ అరాచక పాలనలో బీజేపీ అగ్రనేతలపై తప్పుడు కేసులు బాణయించి శూనకానందం పొందారని అది పూర్తి నిరాధారమైన కేసుగా తోసిపుచ్చిన హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఇది బిఆర్ఎస్ కు చెంప పెట్టు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ సా,సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్ ,జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి , కనుకుంట్ల రంజిత్, గడల కుమార్,కుచన క్రాంతికుమార్, బైరి మురళి కృష్ణ, నోముల రతన్, గోగికర్ అనిల్, రాము, రాంచందర్, శిఖరి నాగరాజు, మహమ్మద్ రఫీ, శివ, ముచ్చర్ల ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ శేషు కుమార్ పై కేసు నమోదు చేసిన పోలీసులు

**హన్మకొండ మహా :** జీఎల్ఎస్ డెంటల్ క్లినిక్ నిర్వాహకుడు డాక్టర్ శేషు కుమార్ పై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమకొండ పట్టణంలోని కాకాజి కాలనీలో డాక్టర్ శేషు కుమార్ జి ఎల్ ఎస్ డెంటల్, ఇంప్లాంట్ సెంటర్ ను గత కొన్ని సంవత్సరాలుగా నడుపుతున్నాడు. సదరు దంత వైద్యుడికి ఎండిఎస్ డిగ్రీ లేకపోయినను పత్రికా ముఖంగా ప్రచురణాలు ఇస్తూ గత కొద్ది కాలంగా నగర ప్రజలను మోసం చేస్తున్నాడని, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ అధికారులు రాష్ట్ర దంత వైద్య మండలి, హనుమకొండ కలెక్టర్ కు ,జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయగా, రాష్ట్ర దంతమండలి జిల్లా వైద్యాధికారి ప్రాథమిక విచారణ జరిపి సదరు డాక్టర్ శేషు కుమార్ ఎటువంటి ఎండీఎస్ డిగ్రీ పట్టా లేకుండా వైద్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్టు నిర్ధారించి సదరు డాక్టర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి హనుమకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడిని అరికట్టాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**



**రాజేంద్రనగర్, మహా ;** తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి టి,ఆనంద్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి అంటు మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ కు సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ లో పరిధిలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలి. పర్మినెంట్ చేసే వరకు కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు అమలు చేయాలన్నారు. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) కార్మికులకు కనీస వేతనం 35 వేల రూపాయలు పెట్రోల్, కార్మికులకు ఉదయాన్నే హాజరు తీసుకోవడానికి ట్యాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి విధులను నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయడం లేదు, జిహెచ్ఎంసిలో కార్మికులు ఉదయాన్నే విధులకల్పించడంలో రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారు. సెంటర్ డివైడర్లకు పారిశుద్ధ్య పనులు చేస్తున్న సమయంలో కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించాలి. జిహెచ్ఎంసి అధికారులు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒక ఎస్ ఎఫ్ ఏ చూసే ప్రాంతంలోని చెత్త ఒకే దగ్గర పాయింట్ డంపింగ్ చేయాలని అధికారులు కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారు. చాలా దూరం నుండి చెత్తను తీసుకురావడానికి కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదు.ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న క్యాజువల్ లీవులు సంవత్సరానికి 15 లీవులు నేటి వరకు కూడా అమలు చెయ్యకపోవడం మరి దారుణమన్నారు. కార్మికులు మరణిస్తే దాన సంస్కారాల ఖర్చులు 30000 రూపాయలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో కార్మికుడు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ కాకుండా జిహెచ్ఎంసి నుండి 25 లక్షల రూపాయలు ఇవ్వాలి. కార్మికులు 60 సంవత్సరాలు నిండి రిటైర్మెంట్ అవుతున్నా కార్మికులకు 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్నా, కార్మికుల వేతనాలు పెంచడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దేశంలో రాష్ట్రంలోని రోజు రోజుకి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పస్తులుండి సేవలందిస్తున్న కార్మికులను ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ట్రెజరీ ద్వారా వేతనాలు అందించాలి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం యూనియన్ మండల అధ్యక్షులుఏరాజు, ఈ.సాయిలు, ఆర్ నరసింహ, జి.రమేష్, పెంటయ్య, అండాలు, లక్ష్మి, కమలమ్మ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని అట్రాసిటీ కేసులను పరిష్కరించాలి

**రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయంలో, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిసిపిలు సత్యనారాయణ, పూర్ణ చంద్రరావు, ఉదయ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో, పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సి,ఎస్టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో ల్యాండ్ మరియు అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్సి,ఎస్టి అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ వెంకటయ్య, అదనపు కలెక్టర్, డీసీపీలకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. అధికారులు ఎస్సి,ఎస్టి గురుకుల పాఠశాలలను, వసతి గృహాలను తరచు తనిఖీలు చేయాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సి, ఎస్టిలపై వేధింపులకు గురిచేసే అధికారుల పై కఠిన చర్యలు కమిషన్ తరపున తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సి,ఎస్టిలకు సంబంధించిన అన్ని రకాల కేసులను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రతి నెల రోజులకు ఒకసారి ఎస్సి,ఎస్టి సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్, ఎస్పీలకు, ఎస్సీ కమిషన్ చైర్మన్ సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ... భూమి సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్సి,ఎస్టిలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సి,ఎస్టిల సంక్షేమం కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు వసతి గృహాల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమాలను జిల్లా అదనపు కలెక్టర్, ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ కు వివరించారు. జిల్లాలో ఉన్న సమస్యలను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డిఆర్ఓ సంగీత, డిసిపిలు సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, ఉదయ్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామావేశ్వరి దేవి,జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు చంద్రకళ, వెంకట్ రెడ్డి, సరిత తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లు



**రాజేంద్రనగర్ మహా ;** 111 జీవో పరిధిలోని ప్రభుత్వ సీలింగ్ భూములలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లు, అమ్యా అమ్యాలు ఇచ్చుకో ప్లాంట్ వేసుకో అన్న చందంగా మరింది. శంషాబాద్మున్సిపాలిటీ పరిధిలోని కోత్వాల్ గూడ సర్వీస్ రోడ్డుకు అనుకొని ఉన్న వందల ఎకరాల సీలింగ్ భూములలో ఇష్టానుసారంగా సుమారు 25 రెడీమిక్స్ ప్లాంట్ విస్తరించాయి. రెడీమిక్స్ ప్లాంట్లతో సర్వీస్ రోడ్లన్ని చిత్రమవడంతోతరుచు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. రెడీమిక్స్ ప్లాంట్ల వల్ల వచ్చే కాలుష్యం దుమ్ము దులితో శంషాద్ నుంచి హిమాయత్ సాగర్ వెళ్లే సర్వీస్ రోడ్డు, వెళ్లి వాహనాలు, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. గచ్చిబౌలి, మణికొండ, హైటెక్ సిటీ నుంచి వలస వచ్చి కోత్వాల్ గూడ సీలింగ్ భూములలో అధికారులకు అమ్యా అమ్యాలు ఇచ్చి రోజుకు కొత్త ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నారు. 111 జీవోను తుంగలో తొక్కి ఇస్తానుసారంగా రెడీమిక్స్ మాఫియా ప్రకృతి సహజసిద్ధమైన కొండలను పిండి చేస్తూ రెడీమిక్స్ ప్లాంట్లను విస్తరిస్తున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ గతంలోనే పలు రెడ్డి మిక్స్ ప్లాంట్లను సీజ్ చేశారు. అయినా యదేచ్చగా సీజైనా ప్లాంట్లును యధావిధిగా కొనసాగిస్తున్నారు. వందల ఎకరాల సీలింగ్ భూములలో ప్లాంట్లు విస్తరించాయి. అడిగే నాధుడు లేక ప్రభుత్వ భూములలో కోట్లు సంపాదిస్తున్నారు. అమ్యా అమ్యాలకు అలవాటు పడి అధికారులు అటుపక్క రావటంలేదు.

**ఎమ్మార్వో రవీందర్ దత్ వివరణ..**

111 జీవో కు విరుద్ధంగా ప్రభుత్వ భూములలో ఏర్పాటుచేసిన రెడ్ మిక్స్ ప్లాంట్లను తొలగిస్తాము. గతంలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రెవెన్యూ అధికారులు సమయుక్తంగా పలు రెడ్ మిక్స్ ప్లాంట్లను సీజ్ చేశాము. ప్రభుత్వ భూములలో ప్లాంట్లు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటోలో ప్రయాణించనందుకు ప్యాసింజర్ పై

## ఎయిర్ గన్ తో గుర్తు తెలియని దుండగులు కాల్పులు

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడా గ్రామంలో సమీర్ దాస్, అతని అల్లుడైన పింటూ హాట్టి, కొత్త ఇంటి నిర్మాణంలో లేట్ నైట్ వరకు మేస్త్రీతో పని చేయిస్తూన్నారు. ఇంటికి బయలుదేరుదామని బుధవారం అర్ధరాత్రి ఒంటిగంటకు స్కూటీ స్టార్ట్ కాకపోవడంతో పీంటూ హాట్టి, అతని స్నేహితుడు ఉబరా, ఓలా , బుక్ చేసుకుందామని అనుకున్నారు. అంతలోనే ఆటో అటు నుంచి వెళ్తుంది. ఆటో ని పిలిచి సిటీ కాలేజీకి వస్తావా, అడిగారు, ఆటో డ్రైవర్ ఎనిమిది వందల రూపాయలు అయితే వస్తాను అన్నాడు. 500 ఇస్తానని పీంటూ హాట్టి అతని స్నేహితులు చెప్పారు. 500 కు రాను అని ఆటో డ్రైవర్స్ చెప్పడంతో సరే వెళ్ళండి వద్దు అన్నారు. ఆటోలో వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని సమీర్ దాస్ ను కొట్టి, ఎయిర్ గన్ తో కాల్చి పారిపోయారు. బాధితుడు వెంటనే 100 డయల్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఈనెల 22 తారీఖున గీతా పరివార సంఘం రాష్ట్ర సదస్సు

- **సదస్సును జయప్రదం చేయాలని: అడ్వకేట్ పి రాములు గౌడ్**
- **కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలి**



**రంగారెడ్డి జిల్లా మహా:** ఈనెల 22 తారీఖున జరిగే గీతా పరివార సంఘం రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని అడ్వకేట్ పి రాములు గౌడ్ అన్నారు. గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికై ఈనెల 22వ తారీఖున బషీరాబాద్ ప్రెస్ క్లబ్ నిర్వహించబడే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని, రాష్ట్ర గీత పరివార సంఘం ఉపాధ్యక్షుడు పి రాములు గౌడ్ కోరారు. గురువారం ఇబ్రహీంపట్నంలో గౌడ సంఘం కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా గీతా పరివారక సంఘం ఆధ్వర్యంలో, రాష్ట్రం సదస్సు సంబంధించిన కరపత్రాలు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ... 560 జీవో ప్రకారం ప్రతి సొసైటీకి పదికరాల ప్రభుత్వ భూమి కేటాయించాలి గతంలో కేటాయించిన భూములను అన్యాక్రాంతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ కు వెంటనే నిధులు కేటాయించాలని, కాటమయ్య రక్షణ కవచాలను అన్ని సొసైటీలకు ఇవ్వాలని, రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 13 కోట్ల ఎక్రేషియా వెంటనే విడుదల చేయాలని, వృత్తిదారుల సమస్యల పై వృత్తిదారుల సమస్యలపై జరగబోయే రాష్ట్ర సదస్సు విజయవంతం చెయ్యాలని రాములు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాళ్ల మహేష్ గౌడ్, జిల్లా నాయకులు గురుజని యాదయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్, మధు గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ నాయకులు విసిరిన సవాల్ ను

## స్వీకరించిన ఎమ్మెల్యే

**గన్ మెన్ లు లేకుండా ఒంటరిగా తిరిగిన నాయిని**

**హన్మకొండ మహా;** బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ హనుమకొండ అభివృద్ధిలో వెనుకబడిందని ప్రజలకు ఎటువంటి న్యాయం చేయాలేని ఎమ్మెల్యే పై ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారని గన్ మెన్ లు లేకుండా దమ్ముంటే బస్టాండు వెళ్లగలవా అని సవాల్ విసిరిన నేతలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెంపపెట్టు సమాధానం ఇచ్చారు. తాను ఏప్పుడు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల పక్ష నిలబడ్డానే కానీ హంగు ఆర్భాటాలకు ముందు వరుసలో లేనని వెల్లడించారు. గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు కూడా యూనివర్సిటీ విషయాలపై సవాల్ విసిరినప్పుడు కనీసం ముందుకు రాని నాయకులు ఇప్పుడు గన్మెన్లు లేకుండా తిరగాలని నాపై సవాల్ వేయడం హాస్యాస్పదమని అన్నారు. రాజకీయాల్లో దిగజారుడు పనులు చేస్తూ రాజకీయాలను భ్రష్టు పట్టించిన రాజయ్య కూడా నా పనితనాన్ని విమర్శిస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా కనబడుతున్నాయి. గత ప్రభుత్వం డబల్ బెడ్ రూము ఇళ్లు కట్టించినప్పటికీ లబ్ధిదారుల దగ్గర డబ్బులు తీసుకుని కాలయాపన చేసి లంచగొండులుగా మరింది మీరు ప్రజా క్షేత్రంలో మీరు పరిపాలించిన కాలం మొత్తం ప్రజలకు ఏమి చేయలేదని ప్రజలు పక్కన పెడితే ఇంకా బుద్ధి లేనట్టుగా మాటలతో పబ్బం గడుపుతూ కేవలం మాటల వరకే మీ మీనమేషాలు చూపించడం ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గతంలో విద్యావంతులుగా ఉండి ఎందరో పిల్లలకు ఆదర్శవంతంగా ఉండి ఇప్పుడు దొరగారి దొడ్డిలో బానిసవ్వడం ఆ దొరగారి మెప్పుకోసం ఊకదంపుడు ఉపన్యాసాలు అర్థం లేని మాటలు మాట్లాడడం సరికాదన్నారు. మంచి వ్యక్తి తప్పుడు పార్టీలో ఉన్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని ఎద్దేవా చేశారు.

## హిమాయత్ నగర్ మహేందర్ యాదవ్ గురుస్వామి పాదయాత్ర ముగించుకొని రావడంతో ఘన సన్మానం

**శాంతి యువజన సంఘం అధ్యక్షులు కుమారి విఠల్ మరియు మాల స్వామి**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన ముదిగొండ మహేందర్ యాదవ్ గురుస్వామి 18వ సారి అయ్యప్ప మాల ధరించి హిమాయత్ నగర్ నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకొని బుధవారం హిమాయత్ నగర్ సన్నిధానానికి వచ్చారు. అజీజ్ నగర్ కు చెందిన అల్లం శ్రీనివాస్ రెడ్డి గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పాదయాత్రలో బయలుదేరిన మహేందర్ గురుస్వామిని గురువారం హిమాయత్ నగర్ శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్ మరియు మాల స్వామి (మాజీ కో ఆప్షన్ సభ్యులు) మహేందర్ గురుస్వామిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం స్వాములు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణ కై చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాల వినియోగించే వారితో పాటు, వీటిని క్రయ విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించడం, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్స్ కంట్రోల్ టీం అధ్వర్యంలో "సే నొ టు డ్రగ్స్" నినాదంతో రూపొందించిన ప్రచార గోడ పత్రికలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం అధికారులతో కలసి కమిషనరేట్ కార్యాలయంలో అవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందని, యువత భవితవ్యాన్ని కాపాడడం మనందరి ప్రధాన కర్తవ్యమని, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సిన బాధ్యత వుంటుందని. ఇందుకోసం ఎవరైన మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నంబర్లకు సమాచారం అందించి డ్రగ్స్ రహిత సమాజం కోసం మీరు కూడా భాగస్వాములు కావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిపిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి, ఆర్.ఐ శివకేశవులు, ఇన్స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు, సందీప్ పాల్గొన్నారు.

# సమాజంలో ప్రేమ వివాహాలు నేరం కాదు

## మానవ మృగాలను వదిలిపెట్టె ప్రసక్తే లేదు

- ఎర్ర రాజశేఖర్ హత్యపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తాం: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎల్లంపల్లి గ్రామంలో హత్యకు గురైన రాజశేఖర్ కుటుంబానికి పరామర్శ
- తక్షణ సాయం కింద రూ 50వేల చెక్కు అందజేత
- అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వ సహకారమందేలా చూడాలని ఆర్డీఓకు ఆదేశం
- బాధిత కుటుంబానికి రెండు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఎర్ర రాజశేఖర్ హత్యను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ పార్టీ



**షాద్ నగర్, మహా:** సమాజంలో ప్రేమించి పెళ్లి చేసుకోవడం నేరం కానే కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కును అదేవిధంగా పూర్తి స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి వర్తిస్తుందని కుల ద్రహంకారంతో దళితుడు ఎర్ర రాజశేఖర్ ను హత్య చేయడం అత్యంత దారుణమని దీనిపై ప్రభుత్వం అత్యంత కఠిన చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలబడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎస్సీ విభాగం కాంగ్రెస్ నాయకులు బాదేపల్లి సిద్ధార్థ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, యువ నాయకుడు జాంగారి రవి, సీనియర్ నేత ఎర్రోళ్ల జగన్ సింగపాగ అనిల్ కుమార్ నాగి సాయిలు బొరిగి నరేందర్ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, కొమ్ము కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, యువ నేత కేకే కృష్ణ బీసీ సెల్ అధ్యక్షుడు జాకారం చంద్రశేఖర్ ఎల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భవాని మల్లేష్ తదితరులు ఎమ్మెల్యే వెంటా గ్రామాన్ని సందర్శించారు.

**రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకుంటాం**

హత్యకు గురైన దళితుడు ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వేలపల్లి శంకర్ స్పష్టం చేశారు. రాజశేఖర్ తండ్రి మల్లేష్, భార్య వాణి తదితర కుటుంబ సభ్యులతో ఆయన గ్రామంలో సమావేశం అయ్యారు. ఆ కుటుంబానికి తన సొంతంగా 50వేల రూపాయలు ఖర్చుల నిమిత్తం అందజేశారు. అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ను అందేలా చూడాలని ఆర్డిఓ సరితకు ఫోన్లో ఆదేశించారు. వెంటనే గ్రామాన్ని సందర్శించి వారికి ఉన్న సమస్యలు ప్రభుత్వపరంగా అన్ని తీర్చాలని వీరికి బ్యాంకు ఖాతా లేదని దానిని వెంటనే తెరిపించి వారికి బెనిఫిట్ సందేలా చూడాలని ఆర్డిఓకు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా ఆదేశించారు. సమాజంలో ఇలాంటి చర్యలను ఎవరు హర్షించరని ఒక దళితుడు ప్రేమించాడని అతన్ని ఘోరంగా చంపడం సభ్య సమాజం తలదించుకునే చర్య అని అన్నారు. సమాజంలో తనకు నచ్చిన విధంగా ప్రేమించడం తప్పు కాదని ఇద్దరు పరస్పరం ప్రేమించుకున్నప్పుడు ఆ తప్పు ఒకరిపై నెట్టి అతని చంపడం హేయమైన చర్యని ఖండించారు. రాజ్యాంగంలో అందరికీ పూర్తి స్వేచ్ఛ ఉందని ప్రేమించుకోవడం నేరం కానే కాదని ఆ మాటకొస్తే తన ఇంట్లో కూడా సభ్యులు ప్రేమ వివాహం చేసుకున్నారని సమాజంలో ఎంతోమంది ప్రేమ వివాహాలు చేసుకుని ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎర్ర రాజశేఖర్ ను హత్య చేసిన వారిని పోలీసులు వెంటనే పట్టుకొని ఎనిమిది మందిని రిమాండ్ కు తరలించడం జరిగిందని వారికి కోర్టులో శిక్ష పడేవిధంగా కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగం సహకరిస్తుందని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

**వాడికి ఊరే తెలియదు సారూ**

చనిపోయిన తన కొడుకు ఎర్ర రాజశేఖర్ కు ఊరే సరిగా తెలియదని అతను షాద్ నగర్ లో ఏవో చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడని 30 ఏళ్ల క్రితమే ఊరు విడిచిపెట్టి వెళ్లిపోయామని ఈ మధ్యకాలంలో తాను ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి రిటైర్ అయ్యాక ఇల్లు కట్టుకొని ఊర్లో ప్రశాంతంగా ఉందామని భావించామని ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని రాజశేఖర్ తండ్రి మల్లేష్ ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబానికి ఎన్నో సమస్యలు ఉన్నాయని ఆర్థికంగా భూముల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ప్రభుత్వం తగిన దృష్టితో తనకు న్యాయం చేయాలని హంతకులను కఠినంగా శిక్షించాలని తండ్రి ప్రాధేయపడ్డారు. తన కుమారుడి దినాల కార్యక్రమాల కోసం తన చిన్న కుమారుడు చంద్రశేఖర్ ఊరికి రప్పించాలని అతనికి ప్రభుత్వం అండగా నిలబడాలని కాంగ్రెస్ పార్టీ అధికారులు నాయకులు తన కుటుంబాన్ని రక్షించాలని మల్లేష్ ఎమ్మెల్యే ఎదుట ప్రాదేయపడ్డారు.

**చంద్రశేఖర్ కు రక్షణ కల్పిస్తాం**

గ్రామానికి చెందిన ఇతర కులానికి చెందిన అమ్మాయి భవానీని వివాహం చేసుకున్న చంద్రశేఖర్ కు అతని కుటుంబానికి అందరికీ రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వాన్నిదని పోలీసులకు ఇదివరకే తాను ఆదేశించినట్లు తెలిపారు. దిన వారాల కోసం చంద్రశేఖర్ గ్రామానికి వస్తే వారికి పూర్తిస్థాయిలో అండగా నిలబడాలని కాంగ్రెస్ పార్టీ దళిత సంఘం నాయకులు బాదేపల్లి సిద్ధార్థ, జంగారీ రవికి సూచించారు. కష్టకాలంలో ఈ కుటుంబానికి అండగా ఆసరాగా నిలబడాలని వీరికి ప్రభుత్వం తరఫున అందే ప్రతి సహాయంలో దగ్గర ఉండి మరి చూసుకోవాలని స్థానిక కాంగ్రెస్ నేత జంగారీ రవికి ఆదేశించారు. అనంతరం 50 వేల రూపాయల చెక్కును మృతుడి భార్య వాణి అదేవిధంగా తండ్రి మల్లేష్ చేతుల మీదుగా ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షుడు కర్రొల్ల సురేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ సీనియర్ నేత బాధేపల్లి సిద్ధార్థ, కాంగ్రెస్ పార్టీ ఎస్సి తాలూక యువ నేత జాంగారి రవి, ఎస్సి సెల్ సీనియర్ నేత ఎరోళ్ళ జగన్, టౌన్ ఎస్సి సెల్ అధ్యక్షుడు సింగపాగ అనిల్ కుమార్ , ఫరూఖ్ నగర్ మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, కొందుర్గ్ ఎస్సి సెల్ అధ్యక్షుడు బోరిగే నరేందర్ , మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బాబర్ అలీ ఖాన్,రఘు నాయక్, కృష్ణ రెడ్డి, తిరుపతి రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, యువ నేత కేకే కృష్ణ, బిసి సెల్ అధ్యక్షుడు జాకరం చంద్ర శేఖర్, ఏల్లం పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భవాని మల్లేష్, నేతలు రవీందర్ రెడ్డి, కుర్వా బాలరాజు , మామిడి జగన్ రెడ్డి, మహేష్, గ్రామ ఎస్సి సెల్ అధ్యక్షుడు వేణు గోపాల్, కాంగ్రెస్ పార్టీ నేతలు కట్ట వెంకటేష్ గౌడ్ ,ఖదీర్, ముబరక్, అంబటి రాజు, వెంకటేష్ గుప్త, అబ్దుల్ సాజిద్, లింగారెడ్డి గూడ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## 42% బీసీ రిజర్వేషన్ ప్రవేశపెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే ..


**ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**



**వరంగల్ మహా;** దేశ చరిత్రలోనే 42% శాతం బీసీల రిజర్వేషన్ ప్రవేశపెట్టి కేబినెట్ లో తీర్మానం చేసి గవర్నర్ కు పంపిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. గురువారం వరంగల్ నగరంలోని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండెటి నరేంద్ర కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలనే సంకల్పంతో బీసీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడమే కాకుండా ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం మద్దతు తెలిపేలా చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ ప్రవేశపెట్టి కేబినెట్ ఆమోదం తెలిపిన అనంతరం గవర్నర్ కు పంపించారు. ఈ నేపథ్యంలో బిజెపి, బిఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలు రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ రిజర్వేషన్ ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. వారికి దమ్ము ధైర్యం ఉంటే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 42% బీసీ రిజర్వేషన్ ను ఆమోదించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు శిరీషా శ్రీమాన్, వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు కురివి పరమేష్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు గోరంట్ల రాజు, సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, బొలుగొడ్డు శీను, శ్రీకాంత్, దూపం సంపత్ కూర తోట సదానందం ఎల్ శ్రీనివాస్, దామోదర్ తోట బాలరాజు, రాచర్ల కుమార్, బాబు, డిఎస్ మూర్తి, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిల నినాదాలతో దద్దరిల్లిన చేవెళ్లే

- మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- రంగారెడ్డి ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత అన్నారు. గురువారం రోజున చేవెళ్లలో భారత విద్యార్థి ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మమత హాజరై మాట్లాడుతూ... మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. షి టీమ్స్ ఎక్కడ కూడా సరిగ్గా పని చేయడం లేదని, మహిళల పై హత్యాచారాలు రోజు రోజుకి పెరిగి పెరిగిపోతున్నాయని ఆమె మండిపడ్డారు. మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికంగా హత్యాచార ఘటనలు పెరిగిపోయాయని, భేటీ బచావో బేటి పడావో అని నినాదాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు పనికి వస్తున్నాయి. కానీ నిజంగా జరిగే దుర్మార్గాలను అరికట్టడంలో ఏమాత్రం కూడా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయా అన్నారు. కళాశాలలో మహిళలపై ర్యాగింగ్ ఘటనలు ప్రతిరోజు చూస్తున్నాము. ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలో హత్యాచారం జరుగుతున్న కానీ వాటిని అరికట్టకుండా, నిర్లక్ష్యంగా ప్రభుత్వాలు ఉండటం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్, వసతి గృహాలలో ఉన్న విద్యార్థినిలకు సమాజం పట్ల సమాజంలో జరుగుతున్న సమస్యల పట్ల, అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వారికి అండగా ఉంటూనే ఆడపిల్లను పుట్టనిద్దాం చదవనిద్దాం కాపాడుకుందాం, స్కూటీల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ వసతి గృహాలో విద్యార్థులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. విధులను నిర్వహించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి కాశయ్య కరుణ చేయడం సరికాదన్నారు. అనంతరం జిల్లా కన్వెన్షన్ కమిటీ 10 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ గా జిల్లా కో కన్వీనర్ అంబిక, కీర్తన, కమిటీ సభ్యులు, అమ్ములు, అక్షిత, మానస, నందిని, నవమి, మౌనిక, ప్రియా లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె వై ప్రణయ్, బి. శంకర్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు , శ్రీకాంత్, తరంగ్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు, శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, చరణ్ గౌడ్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, సింధు, వంశీ, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు ఇర్ఫాన్, మాల చందు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సభ్యులు యశ్వంత్, పవన్ కుమార్, విష్ణు, నవీన్, విష్ణు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు దేవాలయాలంటివి

## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి, మహా:** గ్రంథాలయాలు దేవాలయాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు అన్నారు... యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు... విద్యార్థులు స్మాట్ ఫోన్లను వారంలో రెండు రోజులైన పక్కన పెట్టి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదువాలని అన్నారు... సెల్ ఫోన్ మంచి కన్న చెడు ఎక్కువ ప్రభావితం చేస్తుందని.... పుస్తాకాలు చదివి ఎంతో మంది మహానుభావులు, మేధావులు అయ్యారని అన్నారు... జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ నిశబ్దామైన మంచి వాతావరణం గ్రంథాలయాల్లో వుంటుందని వాడ వాడన గ్రంథాలయాలు రావాలని అన్నారు కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేయగా గ్రంథాలయ వారోత్సవల సందర్భంగా వ్యాసరచన,వకృత్వ ,పాటల,నృత్య పోటీలలో విజేతలకు ముఖ్యాతిథులు బహుమతులు అందజేశారు.. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్థీ అధ్యక్షత వహించగా పలు రాజకీయ పార్టీల నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు,పింగల్ రెడ్డి, శెట్టి బాలయ్య, బట్టు రామచెద్రయ్య,రత్నపురం బలరాం,పట్టణ ప్రముఖులు,గ్రంథాలయ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తరణను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి అనిత, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి తో కలిసి డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వెల్లడించారు. ఆయిల్ పామ్ పంట సాగుతో కలిగే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 438 ఎకరాలలో సాగు జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి మిగతా లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఆయిల్ పామ్ సాగులో ఆదాయం అధికంగా ఉంటుందని, ఈ విషయంపై రైతులకు వివరించి పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని చెప్పారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో రైతుల వద్ద నుండి తేమ శాతం, ఇతర నిబంధనల ప్రకారం నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేలా అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకుల సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర సదుపాయాలను సమకూర్చి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన తరువాత వారికి టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక చర్యలను చేపడుతుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి పంట ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసి చెల్లింపులు చేసేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పుస్తాకాలు చదివితేనే నాలెడ్జ్ పెరుగుతుంది

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్థీ

**భువనగిరి, మహా:** విద్యార్థులు పుస్తాకాలు చదివితేనే నాలెడ్జ్ పెరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్థీ అన్నారు. నేడు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు గత ప్రభుత్వంలో గ్రంథాలయాలను పట్టించుకున్న నాధుడు లేడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రంథాలయం వారోత్సవాలకు సహాకరిచిన ముఖ్యాతిధులకు,ప్రముఖులకు అందరికి చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాలకు రాని విద్యార్థిని సుస్మిత ఇంటికి వెళ్లి పరిస్థితులు తెలుసుకున్న కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, మహా:** పాఠశాలకు హాజరు కాని పదవ తరగతి విద్యార్థిని సుస్మిత ఇంటికి వెళ్లి బాలిక తల్లి దండ్రుల స్థితిగతులను తెలుసుకున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు... గురువారం భువనగిరి మున్సిపాలిటీ లో గల సింగన్న గూడెం లోని ఇందిరమ్మ కాలనీ లో నివాసం ఉంటున్న బానోతు సుస్మిత ఇంటికి వెళ్లి ఎందుకు రోజు స్కూల్ కి వెళ్లడం లేదని సుస్మితని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు... సుస్మిత ఇంట్లో పరిస్థితి పై ఆరా తీశారు. ఇంట్లో వాళ్ళ అమ్మకు ఆరోగ్యం సరిగా లేదని , నాన్న మేస్త్రి పనికి వెళతారని,అమ్మకి తోడుగా ఎవరు లేకపోవడం వలన ప్రతి రోజు బడికి వెళ్లలేక పోతున్నానని కలెక్టర్ కు బాలిక సుస్మిత వివరించారు కలెక్టర్ సుస్మిత ఇంటికి వెళ్లిన సమయంలో వాళ్ల అన్నయ్య అమ్మను తీసుకొని ఆసుపత్రికి వెళ్లడం జరిగిందని సుస్మిత కలెక్టర్ కు తెలిపారు. మీ ఇంట్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేను చూసుకుంటానని హామీ ఇచ్చారు.నువ్వు మాత్రం రేపటి నుండి రోజు తప్పని సరిగా స్కూల్ కి వెళ్ళాలని, మంచిగా చదువుకోవాలని అన్నారు. విద్యార్థిని స్కూల్ కి రాని రోజు ఇంటి వద్ద నుండి చదువుకోవడానికి సదుపాయాలు సరిగా లేవని తెలుసుకొని సాయంత్రం లోపు స్టడీ చైర్, రైటింగ్ పాడ్ పంపిస్తానని కలెక్టర్ బాలికకు హామీ ఇచ్చారు.



# మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం


**తుర్కపల్లి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన ధ్యానబోయిన నర్సమ్మ ఇటీవల మృతి చెందగా కామ్రేడ్ ఎరుకల కుమార స్వామి గౌడ్ KAKSG ఫౌండేషన్ ఛైర్మెన్, తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ తన తండ్రి కీర్తి శేషులు కామ్రేడ్ ఎరుకల కుమార స్వామి గౌడ్ జ్ఞాపకార్థం తమ ఫౌండేషన్ తరపున మృతు రాలి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని గురువారం అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దేవరుప్పల మల్లేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,దేవరుప్పల బాలయ్య,ధ్యానబోయిన బొందయ్య,జేరిపోతుల చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటి అధ్యక్షుడు,గాజె మల్లేష్,దత్తాయపల్లి, వేల్పుపల్లి గ్రామాల మాజీ ఉప సర్పంచ్ లు ధ్యానబోయిన మల్లేశ్, ధ్యాన బోయిన అచ్చ య్య,యువజన కాంగ్రెస్ నాయకులు,ధ్యాన బోయిన పోచయ్య,గొప్ప కొండల్ రెడ్డి,ధ్యాన బోయిన ప్రవీణ్,ధ్యాన బోయిన నరేష్ నాయకులు,గ్రామస్థులు, కుటుంబ సభ్యులు,ధ్యాన బోయిన,సత్తయ్య, గువ్వ సత్తయ్య,ధ్యాన బోయిన నర్సయ్య,కిష్టయ్య,ఆంజనేయులు, వెంకటేశ్,కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# భగాయత్ హై స్కూల్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

## లెక్కల టీచర్తై పాఠాలు చెప్పిన కలెక్టర్



**భువనగిరి, మహా:** విద్యరులు కష్టపడి చదివి పదవ తరగతిలో 100% శాతం ఉత్తీర్ణత సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు... ఉపాధ్యాయుడిగా కలెక్టర్ గణితం బోధించి , విద్యార్థులను పిజిక్స్ లో ఫార్ములాలు అడిగిన కలెక్టర్ హనుమంతరావు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో భగాయత్ జెడ్పీ హై స్కూల్ ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు ఎంత మంది ఉన్నారని , అందులో పదవ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రోజు పాఠశాలకు వస్తున్నారా అని పాఠశాలకు రాని విద్యార్థుల ఇండ్లకు ఫోన్ చేసి ఎందుకు రావట్లేదో ఆరా తీసి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులు కూడా వార్షిక పరీక్షల వరకు ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని , అనవసర సెలవులు తీసుకోవద్దని సూచించారు గత సంవత్సరం మాదిరిగాన ఈ సంవత్సరం కూడా మన జిల్లా పదవ తరగతి పరీక్షలల్లో 100% శాతం ఉత్తీర్ణత సాధించేల ఉపాధ్యాయులు ఇప్పటి నుండే విద్యార్థుల పై చొరవ చూపాలని , విద్యార్థులు కూడా ఉపాధ్యాయులు చెప్పిన విధంగా రోజు శ్రద్ధగా చదువుతూ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని సూచించారు. ఏదైనా సబ్జెక్ట్ లో సందేహాలుంటే ఉపాధ్యాయులు ద్వారా నివృత్తి చేసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కిచెన్ లో వంట సామగ్రిని పరిశీలించి, వంట సరకులైన కారం ,పసుపు, చింతపండు నాణ్యత సరిగా లేదని వెంటనే మార్చుకోవాలని సూచించారు. పాఠశాలలో నిర్మాణ పనులు ఆగిన తరగతి గదులను పరిశీలించి , వెంటనే పనులను మొదలుపెట్టి త్వరత గతిన పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ కి ఆదేశాలు జారీ చేశారు.



# బీర్ల అయిలయ్య, అవేజ్ చిస్థీలకు సన్మానం

**భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్థీని ఆలేరుకు చెందిన గ్రంథాలయ రీడర్ రామాంజనేయులు,కాంగ్రెస్ నాయకులు మోతే తిరుపతిలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు...

# బాలల హక్కులు,పరిరక్షణ తల్లిదండ్రులు, అధికారులపై వుంది

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, మహా:** బాలల హక్కులు, వారి పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులు, అధికారుల పై ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు, వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం , అంతర్జాతీయ బాలల పరిరక్షణ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పిల్లలు వారి అభిలాష ప్రకారం వారిని ముందుకు తీసుకువెళ్ళడం, ప్రోత్సహించడం తల్లి దండ్రుల బాధ్యతని , పిల్లల హక్కులు. రక్షణ విషయాలాలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపైన మరియు సమాజం పైన ఉన్నదని తెలిపారు .అనంతరం పిల్లలకు బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బాలలు బంగారు భవితకు పునాదని జిల్లా సంక్షేమ శాఖ తరపున బాల్య వివాహలు ఆపి కౌన్సెలింగ్ చేస్తున్నారని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహా రావు మాట్లాడుతూ పిల్లలు బడిలో ఉండాలి పనిలో కాదన్నారు. ఆపరేషన్ స్మైల్,ముస్కాన్ ద్వారా పని చేసే పిల్లలను రెస్క్యూ చేసి తిరిగి పాఠశాలలో జాయిన్ చేస్తున్నామని, వారిని పనిలో పెట్టుకున్న వ్యక్తులపై శిక్ష, జరిమానాలు విధిస్తున్నామన్నారు. పిల్లల హక్కుల గురించి పిల్లలకు మరియు తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో CWC కమిటీ మెంబర్లు , శివరాజ్, రుద్రమ దేవి, మల్లేశం ,ఇస్తారీ , సిడిపిఓలు శైలజ, సమీరా,బీ ఆర్ బీ. కో ఆర్డినేటర్ అనంత లక్ష్మీ.. జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది.డీసీపీయు యూనిట్.గ్రేస్ కమీషన్ . గ్రేట్ కమీషన్ ఆదరణ. శాంతి నిలయం. ప్రభుత్వ బాల సదనం. జీవన జ్యోతి. చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్. పిల్లలు . స్కోప్ ఎన్ జీవో సోమ నర్సయ్య,తదితరులు,పాల్గొన్నారు.

# ఈనెల 22న జరిగే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయండి : ఎర్ర రమేష్ గౌడ్



**వలిగొండ, మహా :** ఈనెల 22న గీత పనివారల సమస్యల పరిష్కారానికై జరిగే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా గీత పనివారల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో గురువారం సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇంతకుముందు ఉన్న జీవోలు ప్రకారం గీతా పనివారల సమస్యలైన చనిపోయిన వారికి శాశ్వత వికలాంగులకు ఎక్స్గ్రేషియాలను విడుదల చేయాలని 50 సంవత్సరాలు నిండిన మూడు నాలుగు ఏళ్ళు అవుతున్న పనివాళ్లకు పింఛన్ ఇంకా మంజూరు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గంగాపురం వెంకటయ్య బాలగోని మల్లయ్య లగ్గోని యాదయ్య బాలగోని నరసింహ గంగాపురం యాదయ్య కూనురు కృష్ణ చెరుకు శివరాజు గంగాపురం సైదులు వీరమల్ల ముత్తయ్య పల్లె మల్లేష్ వీరమల్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు

# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# శబరిమలలో ఏపీ యాత్రికుల బస్సు ప్రమాదం.. 11 మందికి గాయాలు




**పథనంతిట్ట:** ఆంధ్రప్రదేశ్ నుంచి శబరిమలకు వెళ్తున్న యాత్రికుల బస్సు కేరళలోని మావత్తుపుళ సమీపంలోని త్రికలత్తూర్ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 11 మంది అయ్యప్ప భక్తులు గాయపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీ నుంచి శ్రీదుర్గా ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సులో ఇద్దరు చిన్నారులు సహా.. 33 మంది అయ్యప్ప భక్తులు శబరిమలకు బయలుదేరారు. వీరి బస్సు గురువారం తెల్లవారుజామున త్రికలత్తూర్‌లోని ఎంసీ రోడ్డు మీదుగా వెళ్తుండగా.. అటుగా వేగంగా దూసుకువచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో పాలక్కాడ్‌కు చెందిన లారీ డ్రైవర్ రెమీ, బస్సు డ్రైవర్ గౌతమ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు ముందు వైపు సీట్లలో కూర్చున్న అయ్యప్ప భక్తులు బాలాజీ, వెంకటేశ్, మోహన్ బాబు, గోవింద్, చంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఉమాపతి, ఉదయ్‌కుమార్, దీపికలకు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను అలువాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. యాత్రికులంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారని వెల్లడించారు.

**తప్పిన పెను ప్రమాదం**

లారీ బస్సును వేగంగా ఢీకొనడంతో.. బస్సు డ్రైవర్ నియంత్రణను కోల్పోయి, పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. దాంతో విద్యుత్తు స్తంభం సగానికి విరిగిపోయింది. ఆ సమయంలో అటుగా వెళ్లిన స్థానికులు వెంటనే పోలీసులు, విద్యుత్తు శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో.. అధికారులు వెంటనే విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ఈ ఘటనతో ఉదయం వరకు ఆ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొంది. పోలీసులు గురువారం ఉదయం క్రేన్ సాయంతో లారీని రోడ్డు నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# నితీష్ కుమార్‌కు వైఎస్ జగన్ శుభాకాంక్షలు



బిహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణ స్వీకారం చేసిన నితీష్ కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నితీష్ కుమార్ బిహార్ మరోసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో వైఎస్ జగన్ సోషల్ మీడియా వేదికగా (ఎక్స్ ద్వారా) తన శుభాకాంక్షలను తెలియజేశారు. జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షుడు నితీష్ కుమార్ గురువారం పట్నాలోని గాంధీ మైదానంలో ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఏ)కి చెందిన పలువురు సీనియర్ నేతలు, ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎం నితీష్ కుమార్‌తో పాటు జేడీయూ ఎమ్మెల్యేలు విజయ్ కుమార్ చౌదరి, అశోక్ చౌదరి, శ్రావణ్ కుమార్, లేషి సింగ్, మొహ్మద్ జమాఖాన్, బీజేపీ ఎమ్మెల్యేలు సంజయ్ సింగ్, రామనిషాద్, నితిన్ నబీన్, అరుణ్ శంకర్ ప్రసాద్, సురేంద్ర మెహతా, లఖేంద్ర కుమార్ రోషన్, నారాయణ ప్రసాద్, శ్రేయసి సింగ్ తదితరులు మంత్రులుగా ప్రమాణం చేశారు. దీనికి ముందు నితీష్ ఎన్‌డీఏ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ నుంచి అనుమతి తీసుకున్నారు.

# 18 మెట్ల వద్ద నల్ల త్రాచు.. పట్టుకున్న అటవీ బృందం



**పథనంతిట్ట:** ఓవైపు శబరిమల సన్నిధానం భక్తులతో కిక్కిరిసిపోగా.. ఓ నల్లత్రాచు పాము 18 మెట్లను అధిరోహించేందుకు ప్రయత్నించిన ఉదంతమిది..! ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పెరియార్ రిజర్వ్ ఫారెస్ట్ అటవీ అధికారుల కథనం ప్రకారం.. మంగళవారం శబరిమలలో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంది. సాయంత్రం వేళల్లో ఆ రద్దీ పెరగడంతో నిమిషానికి 80 మంది స్వాములు 18 మెట్లను అధిరోహించారు. ఈ క్రమంలో పద్దెనిమిది మెట్ల సమీపంలో ఓ నల్లత్రాచు కలకలం రేగింది. అటుగా వచ్చిన పాము.. మెట్లపైకి ఎక్కేందుకు యత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు పైనుంచి కేకలు వేస్తూ.. అదిరించడంతో ఆ పాము మెల్లిగా వెనక్కి మరలి.. గణపతి హోమం వైపు వెళ్లింది. సమాచారం అందుకున్న అటవీ బృందం.. కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న స్నేక్ క్యాచర్లను అక్కడకు పంపింది. అటవీ శాఖ స్నేక్ క్యాచర్లు క్షణాల్లో చాకచక్యంతో ఆ పామును ఓ బ్యాగులో బంధించారు. ఈ వీడియోను రాష్ట్ర అటవీశాఖ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. శబరిమలలో మండల సీజన్‌కు ముందే అటవీశాఖ పంపాబేస్, నీలిమల, శరణ్‌గుత్తి, సన్నిధానం, నీలక్కల్ ప్రాంతాల్లో స్నేక్ క్యాచర్ల బృందాలను మోహరించింది. ఇప్పటి వరకు ఈ బృందాలు ఆయా ప్రాంతాల్లో 10కి పైగా విషసర్పాలు, మరో పాతిక దాకా సాధారణ సర్పాలను పట్టుకున్నట్లు వివరించింది.

# స్థానిక పత్రికా ఆఫీసుపై దాడులు : ఖండించిన కశ్మీర్ టైమ్స్



జాతి వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతోందంటూ జమ్మూ కాశ్మీర్ పోలీసులకు చెందిన రాష్ట్ర దర్యాప్తు సంస్థ (SIA) గురువారం జమ్మూలోని కాశ్మీర్ టైమ్స్ కార్యాలయంపై దాడి చేసింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందనే ఆరోపణలతో ఈ దాడులు చేపట్టింది. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ప్రారంభమైన సోదాలలో Ak47 కార్ట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్లు , మూడు గ్రెనేడ్ లివర్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. అసంతృప్తిని వ్యాప్తి చేయడం, వేర్పాటువాదాన్ని కీర్తించడం లాంటివి, భారతదేశం, కేంద్రపాలిత ప్రాంతం, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు భంకరమనే ఆరోపణల కింద కాశ్మీర్ టైమ్స్‌పై కేసు నమోదు చేశారు. కాశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధ భాసిన్ పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో ఉందని ఎన్‌డీటీవీ రిపోర్ట్ చేసింది. మరోవైపు మీడియాలో వస్తున్న ఈ వార్తలను ఆరోపణలను కాశ్మీర్ టైమ్స్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులకు సంబంధించిన తమకు అధికారికర సమాచారమేదీ లేదని ఒక ప్రకటనలో తెలిపింది.. రాష్ట్రానికి హానికలిగించే కార్యకలాపాలు అంటూ ఎస్ఐఏ చేసిన ఆరోపణలని నిరాధారమైనవని పేర్కొంది. తమ కార్యాలయంపై దాడి తమ వాయిస్‌ను అణచివేసేందుకు చేసే మరో ప్రయత్నంలో భాగమేనని ఆరోపించింది. తమ కార్యాలయం గత నాలుగు సంవత్సరాలుగా మూసివేశామని, ప్రింట్ ఎడిషన్ 20212022లో నిలిపివేయగా, డిజిటల్‌గా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నామని వివరించింది. రాష్ట్రానికి తమ కార్యాలయాలపై దాడి చేసే అధికారం ఉండవచ్చు. కానీ నిజాలను మాట్లాడే తమ నిబద్ధతపై దాడి చేయదని పేర్కొంది. జర్నలిజం నేరం కాదు. జవాబుదారీతనం రాజద్రోహం కాదు. తాము తమపై ఆధారపడిన వారికి సమాచారం ఇవ్వడం కొనసాగిస్తామనం ఎడిటర్లుప్రబోధ్ జమ్వాల్, అనురాధ భాసిన్ ప్రకటించారు.

# మరో నలుగురు ప్రధాన నిందితులు అరెస్ట్




ఢిల్లీ పేలుళ్ల కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నలుగురు ప్రధాన నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ తెలిపింది. శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేశారు. దీనితో ఈ కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరుకుంది. నిందితులను పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, అనంతనాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్, షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించినట్లు NIA తన ప్రకటన పేర్కొంది. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు నుండి ప్రొడక్ట్ ఆర్డర్ల మేరకు నలుగురునిందితులను NIA అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనేక మంది అమాయకులను బలిగొనడంతోపాటు, అనేక మందిని గాయపరిచిన ఉగ్రవాద దాడిలో వీరంతా కీలక పాత్ర పోషించారని ఈ ప్రకటన తెలిపింది. కాగా ఢిల్లీలోని ఎర్రకోట పేలుడు ఘటనలో 13 మంది మరణించగా, మరో 32 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బాంబు పేలుడు ఘటనపై భద్రతా దళాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి.



## నా ఫోటోలు అలా చూస్తుంటే చాలా బాధేస్తోంది

కోలీవుడ్ బ్యూటీ కీర్తి సురేశ్ ప్రస్తుతం రివాల్వర్ రీటా మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఉమెన్ సెంట్రిక్ కథతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ సినిమా వాయిదా పడుతూ వస్తోంది. ఈ మూవీ నవంబర్ 28న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు ముద్దుగుమ్మ. ప్రస్తుతం చెన్నైలో రివాల్వర్ రీటా ప్రమోషన్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం విస్తరిస్తున్న ఏఐ టెక్నాలజీ వినియోగంపై కీర్తి సురేశ్ మాట్లాడారు. ఏఐతో సోషల్ మీడియాలో వస్తోన్న ఫోటోలపై ఆందోళన వ్యక్తం చేశారు. తన ఏఐ మార్ఫింగ్ ఫోటోలను చూసినప్పుడు చాలా బాధగా ఉంటుందని తెలిపారు. కృత్రిమ మేధస్సు వల్ల ఎదురయ్యే సవాళ్లను అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు.కీర్తి సురేష్ మాట్లాడుతూ.. "ఈ రోజుల్లో ఏఐ అనేది ఒక పెద్ద సమస్యగా మారింది. ఇది ఒక వరమే కానీ..ఒక రకంగా శాపం కూడా. మానవులు సాంకేతికతను కనుగొన్నారు. కానీ ఇక్కడ మనం నియంత్రణ కోల్పోతున్నాం. సోషల్ మీడియాలో అసహ్యకరమైన దుస్తుల్లో నా చిత్రాన్ని చూసి ఆశ్చర్యపోతుంటా. నేను ఎప్పుడైనా నిజంగానే ఇలాంటివీ ధరించానా అని షాకవుతుంటా. ఇటీవల నేను సినిమా పూజ కోసం ధరించిన దుస్తులను వేరే కోణంలోకి మార్చి చూపించారు. అది చూసిన క్షణం నేను షాకయ్యా. ఆ తర్వాత నేను అలా పోజు ఇవ్వలేదని గ్రహించా. ఇలాంటివి చూసినప్పుడు చిరాకు తెప్పిస్తుంది. అంతేకాదు బాధగా కూడా అనిపిస్తుంది" అని పంచుకుంది. ఈ సమస్య కేవలం సినిమా పరిశ్రమకే పరిమితం కాదని.. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు గురైన ఎవరినైనా ప్రభావితం చేస్తుందని కీర్తి సురేష్ పేర్కొన్నారు. కాగా.. ఇటీవల ఏఐ వినియోగం పెరిగాక పలువురు సెలబ్రిటీల ఫోటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. నటి ఆండ్రియా జెరెమియా కూడా ఏఐతో సంబంధం ఉన్న నష్టాల గురించి ప్రస్తావించారు, ఈ సాంకేతికత వినోద రంగానికి సవాల్‌గా మారిందన్నారు. కేవలం నటులకే కాదు ప్రజలకు కూడా ఏఐ సమస్యగా మారుతోందని.. ఏఐ మన కోసం పనిచేయాలి.. మరోలా కాదన్నారు.



## రూ.252 కోట్ల డ్రగ్స్ కేసు..

### బాలీవుడ్ ఇన్‌సైడర్ ఓర్రీకి నోటీసులు

బాలీవుడ్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పేరు తెచ్చుకున్న ఓర్రీ (ఓర్హాన్ అవత్రమణి) వివాదాలకు కేర్ ఆఫ్ అడ్రస్.. 'బాలీవుడ్ బీఎఫ్ఎఫ్'గా ఒర్రీ పాపులర్. ఎక్కడ ఏ సెలబ్రిటీ ఫంక్షన్ జరిగినా వాలిపోతూ ఉంటాడు. తన చేష్టలతో నెట్టింట హల్‌చల్‌గా మారతాడు. అయితే, తాజాగా డ్రగ్స్ కేసుకు సంబంధించి ముంబై పోలీసులు ఓర్రీకి నోటీసులు జారీ చేశారని హిందీ మీడియా నివేదించింది. రూ.252 కోట్ల రూపాయల మాదకద్రవ్యాల కేసుకు సంబంధించి బాలీవుడ్ ఇన్‌సైడర్‌గా పేరున్న ఓర్రీకి ముంబై పోలీసులు సమన్లు జారీ చేసినట్లు ANI సంస్థ నివేదించింది. నేడు ఉదయం 10 గంటలకు యాంటీనార్కోటిక్స్ సెల్ (ANC) ఘట్కోపర్ యూనిట్ ముందు హాజరు కావాలని ఓర్రీని పోలీసులు కోరారు. విచారణలో మాత్రమే అతని పేరు కనిపిస్తుంది, అయితే ఈ కేసులో ఓర్రీ పాత్ర ఏమిటో పోలీసులు వెల్లడించలేదు. అనేక నివేదికల ప్రకారం, ఇటీవల UAE నుండి వచ్చిన సలీం డోలా కుమారుడు తాహెర్ డోలాకు సంబంధించిన అనేక విచారణ పత్రాలలో ఓర్రీ పేరు బయటపడింది. సలీం డోలా భారతదేశంతో పాటు విదేశాలలో సెలబ్రిటీ పార్టీలలో బహిరంగంగా మాదకద్రవ్యాలను వినియోగించే భాగమని ఇండియా టుడే నివేదించింది.

నటీనటులు ప్రశంసలనే కాదు విమర్శలను ఎదుర్కోక తప్పదు. అలా అభినందనలకు ఉప్పొంగేవారు, విమర్శలను మాత్రం తట్టుకోలేరు. ఇది వాస్తవం. ఇప్పుడు నటి కయాదు లోహర్ పరిస్థితి కూడూ ఇలాంటిదే. 2021లో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు కన్నడం, మలయాళం, తెలుగు, మరాఠీ, బెంగాళీ భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా నాయకిగా పేరు తెచ్చుకుంటున్నారు. అయితే తమిళంలో నటించిన డ్రాగన్ చిత్రానికి ముందు ఈ భామకు అంత పేరు లేదు. ఎప్పుడైతే ప్రదీప్ రంగనాథ్‌తో డ్రాగన్ చిత్రంలో నటించారో అప్పటి నుంచి ఒక్క సారిగా స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. కాగా ఇటీవల ఒక నటి బరువుపై జరిగిన చర్చలో తలదూర్చిన కయాదు లోహర్‌పై కూడా విమర్శలు రావడం మొదలెట్టాయి. దీంతో తనను టార్గెట్ చేస్తున్నారని ఈ అమ్మడు వాపోతున్నారు. దీని గురించి కయాదు

## ఆ విమర్శలు చాలా వేదనకు గురిచేస్తున్నాయి: కయాదు లోహర్

లోహర్ ఓ యూట్యూట్ ఛానల్‌కు ఇచ్చిన భేటీలో తన గురించి జరుగుతున్న విమర్శలు చాలా వేదనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఒక సంప్రదాయబద్ధమైన కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయిని తానని అన్నారు. తన గురించి వెనుక విమర్శించినా బాధపడకపోయినా అది తనను వేధిస్తూనే ఉంటుందన్నారు. అసలు తనను ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కాగా ప్రస్తుతం ఈ భామ తమిళంలో నటుడు అధర్వకు జంటగా నటిస్తున్న ఇదయం మురళి అనే చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. అదే విధంగా జీవీ ప్రకాశ్‌కు జంటగా ఆమ్మార్టల్ అనే చిత్రం నిర్మాణ దశలో ఉంది. కాగా నటుడు శింబు సరసన ఒక చిత్రంలో నటించనున్నారు.అదే విధంగా నటుడు దనుష్‌కు జంటగా నటించనున్న చిత్రానికి లబ్బర్ బంతు చిత్రం ఫేమ్ తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వం వహించనున్నారు. వీటితో పాటూ కన్నడం, తెలుగు, మలయాళం భాషల్లోనూ ఒక్కో చిత్రంలో నటిస్తున్నారు.





## మళ్లీ తల్లి కాబోతున్న సోనమ్

బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ (Sonam Kapoor) రెండోసారి తల్లి కాబోతుంది. తాజాగా ఈ విషయాన్ని తెలుపుతూ సోషల్‌మీడియాలో క్రేజీగా పోస్ట్ చేసింది. 2018లో వ్యాపారవేత్త ఆనంద్ అహుజాను పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, 2022లో వారికి వాయు అనే కుమారుడు జన్మించాడు. ఇప్పుడు రెండో బిడ్డకు జన్మనివబోతున్నట్లు ఆమె ప్రకటించింది. కెరీర్ పరంగా బిజీగా ఉన్న సమయంలోనే సోనమ్ ప్రేమ వివాహం చేసుకుంది. వివాహం తర్వాత భర్త, పిల్లలే తన ప్రపంచం అంటూ సినిమాలకు దూరంగా ఉంటుంది. కానీ, సోషల్‌మీడియాలో ఆమె ఎప్పుడూ కూడా యాక్టివ్‌గానే కనిపిస్తుంది. అయితే, తాజాగా సోనమ్ కపూర్ క్రేజీగా రెండో ప్రెగ్నెన్సీ గురించి ప్రకటించగానే అభిమానులు శుభాకాంక్షలు చెబుతున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో పింక్ డ్రెస్ ధరించి కొన్ని ఫొటోలను అభిమానులతో పంచుకుంది. తన బేబీ బంప్‌ను ప్రదర్శిస్తూ.. సంతోషంగా కనిపించింది. నటుడు అనిల్ కపూర్ కుమార్తె సోనం 2007లో 'సావరియా' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఢిల్లీ6, బాంబే టాకీస్, ప్రేమ రతన్ ధన్ పాయో, నీర్జా, సంజు వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com